నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్‌కు జేపీ నడ్డా..

ఎయిర్‌పోర్ట్‌లో టెన్షన్..టెన్షన్..

హైదరాబాద్, జనవరి 4:జేపీ నడ్డా రాకతో హైదరాబాద్‌లో పోలిటికల్ హీట్ పెరిగింది. సికింద్రాబాద్‌లోని ఎంజీ రోడ్డులో జేపీ నడ్డా తలపెట్టిన క్యాండిల్ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరించారు. అయితే... అంతకు ముందు ఈ ర్యాలీకి పోలీసులు అనుమతి ఇచ్చినట్లు మీడియాలో కథనాలు వచ్చాయి. ఈ క్రమంలో హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ క్లారిటీ ఇచ్చారు. కోవిడ్ నిబంధనల నేపథ్యంలో జేపీ నడ్డా ర్యాలీకి అనుమతి లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్ | బుధవారం 5-1-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 127 | పేజీలు:4 | వెల: రూ.1/-

తెలంగాణలో కరోనా పరిస్థితులపై హైకోర్టులో ప్రభుత్వం నివేదిక

హైదరాబాద్, జనవరి 4:కరోనా పరిస్థితులపై హైకోర్టులో మంగళవారం విచారణ జరిగింది. కరోనా పరిస్థితులపై డీహెచ్, డీజీపీ హైకోర్టుకు నివేదికను సమర్పించారు. రాష్ట్రంలో ఒమిక్రాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హైకోర్టుకు డీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. కేంద్ర మార్గదర్శకాలను రాష్ట్రం అమలు చేస్తోందని చెప్పారు. రాష్ట్రంలో ఈనెల 1 నాటికి 2.97 కోట్ల కరోనా పరీక్షలు చేశామని వివరించారు.

రాష్ట్రంలో ఇప్పటివరకు మొత్తం 6,82,215 మందికి కరోనా పాజిటివ్ వచ్చిందని తెలిపారు. పాజిటివిటీ రేటు 2.29శాతం, మరణాల రేటు 0.5 శాతంగా ఉందని పేర్కొన్నారు. 34 ప్రభుత్వ, 76 ప్రైవేట్ ఆర్టీపీసీఆర్?, 1,231 రాపిడ్ పరీక్షా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆక్సిజన్ సదుపాయం పెరిగిందని.. టీకా మొదటి డోసు 100శాతం, రెండో డోసు 69శాతం పూర్తైందని గత హైకోర్టు సమర్పించిన నివేదికలో శ్రీనివాసరావు పేర్కొన్నారు.

న్యూ ఇయర్ వేడుకల్లో నిబంధనల ఉల్లంఘనలపై 907 కేసులు నమోదు అయ్యాయని డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు. సమయానికి మించి వేడుకలు నిర్వహించినందుకు 263 కేసులు నమోదు అయ్యాయని, పబ్లిక్ న్యూసెన్స్ చేసినందుకు 644 కేసులు చేసినట్లు చెప్పారు. అలాగే మాస్కులు పెట్టుకోని వారికి జరిమానాలు విధిస్తున్నామని కోర్టుకు తెలిపారు. గత నెల 24 నుంచి ఈ నెల 2 వరకు 16,430 మందికి జరిమానా వేశామన్నారు. జూన్ 20 నుంచి డిసెంబరు 23 వరకు 5,10,837 మందికి జరిమానా విధించినట్లు చెప్పారు. ఈ నెల 10 వరకు సభలు, ర్యాలీలు, నిరసనలకు అనుమతివ్వడం లేదని, జనం గుమిగూడకుండా పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు డీజీపీ మహేందర్ రెడ్డి తెలిపారు.

మరోవైపు కరోనా వ్యాప్తి దృష్ట్యా కోర్టులు, విద్యా సంస్థలు ఆన్ లైన్‌లో నిర్వహించాలని పిటిషనర్ల తరపు న్యాయవాదులు హైకోర్టును కోరారు. వాదనలు విన్న హైకోర్టు.. కరోనా పరిస్థితులపై తదుపరి విచారణ ఈ నెల 7కు వాయిదా వేసింది.

ఊరూరా రైతుబంధు సంబురం..

హైదరాబాద్, జనవరి 4:తెలంగాణలో పంట పెట్టుబడి సాయం అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. దండగ అన్న వ్యవసాయాన్ని రైతు బంధు పథకం పండుగ చేసింది. కర్షకులకు వడ్డీ వ్యాపారుల నుంచి విముక్తి కల్పించింది. అప్పుల ఊబి నుంచి గట్టెక్కిచ్చింది. సాగుకు భరోసానిచ్చింది. ప్రతి సీజన్‌లో పెట్టుబడి సాయం అందుకుని రైతులు దర్జాగా సాగుకు కదులుతున్నారు. పథకానికి నాలుగేళ్లు పూర్తయ్యాయి. పథకం ఆరంభం నుంచి ఈ నెల 10 లోపు రాష్ట్ర వ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రూ.50 వేల కోట్లు జమ అవుతున్నాయి.

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు ఖమ్మం నియోజకవర్గంలో సంబురాలు ప్రారంభమయ్యాయి. ప్రజాప్రతినిధులు, టీఆర్ఎస్ నేతలు కొవిడ్ నిబంధనలు పాటిస్తూ వేడుకలు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సూచనల మేరకు ఖమ్మం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ డోలే లక్ష్మి ప్రసన్న ? సాయికిరణ్ నేతృత్వంలో మిర్చి పంటతో "జై రైతు బంధు కేసీఆర్" అని ఆకారాన్ని రూపొందించారు. రఘునాథపాలెం మండలం వేపకుంట్ల గ్రామంలో మహిళలు తెలంగాణ రైతు బంధు అంటూ ముగ్గులు వేసి ముగ్ధులయ్యారు.

హైకోర్టు కీలక నిర్ణయం.. కేసుల ప్రత్యక్ష విచారణ నిలిపివేత

హైదరాబాద్, జనవరి 4:కొవిడ్ వ్యాప్తి నేపథ్యంలో తెలంగాణ హైకోర్టు మంగళవారం కీలక నిర్ణయం తీసుకున్నది. హైకోర్టులో ప్రత్యక్ష విచారణ నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రత్యక్ష, ఆన్‌లైన్ విచారణపై జడ్జిలకు విచక్షణాధికారాన్ని ఇచ్చింది. ప్రత్యక్ష విచారణ చేపడితే కోవిడ్ నిబంధనలు పాటించాలని సూచించింది. ఇదిలా ఉండగా.. రాష్ట్రంలో కరోనా పరిస్థితులపై హైకోర్టుకు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు నివేదిక సమర్పించారు. ఒమిక్రాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను రాష్ట్రం అమలు చేస్తున్నట్లు తెలిపారు.

మణిపుర్ లోని ఇంఫాల్ లో వివిధ అభివృద్ధి పథకాల ను ప్రారంభించి శంకుస్థాపన చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 4:ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు న మణిపుర్ లోని ఇంఫాల్ లో సుమారు 2950 కోట్ల రూపాయల విలువైన 9 ప్రాజెక్టుల కు శంకుస్థాపన చేయడంతో పాటు దాదాపు గా 1850 కోట్ల రూపాయల విలువైన 13 ప్రాజెక్టుల ను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులు రహదారుల సంబంధిత మౌలిక సదుపాయాలు, తాగునీటి సరఫరా, ఆరోగ్యం, పట్టణ ప్రాంతాల అభివృద్ధి, గృహనిర్మాణం, సమాచార సంబంధి సాంకేతిక విజ్ఞానం, నైపుణ్యాభివృద్ధి, కళలు, ఇంకా సంస్కృతి సహా వివిధ రంగాల కు చెందినవి అయి ఉన్నాయి.

1700 కోట్ల రూపాయల కు పైచిలుకు ఖర్చు తో నిర్మించే అయిదు జాతీయ రహదారి పథకాల పనుల కు ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. ఎన్ హెచ్-37 పై బరాక్ నది మీద ఒక ఉక్కు వంతెన ను ఆయన ప్రారంభించారు. దీని నిర్మాణాని కి 75 కోట్ల రూపాయల కు పైనే వ్యయం అయింది. ఇది సిల్ చర్ కు మరియు ఇంఫాల్ కు మధ్య వాహనాల రద్దీ ని తగ్గించనుంది. రమారమి 1100 కోట్ల రూపాయల ఖర్చు తో నిర్మించినటువంటి 2387 మొబైల్ టవర్ లను కూడా మణిపుర్ ప్రజల కు ప్రధాన మంత్రి అంకితం చేశారు.

ప్రధాన మంత్రి 280 కోట్ల రూపాయల విలువైన 'థౌబల్ బహుళార్థ సాధక జల పంపిణీ వ్యవస్థ' ను కూడా ప్రారంభించారు. ఇది ఇంఫాల్ నగరాని కి తాగునీటి ని సరఫరా చేస్తుంది; ఈ నీటి సరఫరా పథకం నిర్మాణాని కి 65 కోట్ల రూపాయలు ఖర్చయింది. తామెంగ్ లోంగ్ జిల్లా లో పది జనావాసాల లో నివసిస్తున్న వారికి రక్షిత తాగునీటి ని ఈ పథకం అందజేస్తుంది. దీనితో పాటు 51 కోట్ల రూపాయల వ్యయం తో అభివృద్ధి పరచిన సేనాపతి జిల్లా కేంద్ర నీటి సరఫరా పథకాన్ని కూడా ప్రారంభించడం జరిగింది.

ఇంఫాల్ లో ఒక 'అత్యంత ఆధునికమైన కేన్సర్ ఆసుపత్రి' కి కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. పిపిపి పద్ధతి లో నిర్మించే ఈ ఆసుపత్రి విలువ సుమారు 160 కోట్ల రూపాయలు. కియామ్ గెయి లో 200 పడకల సదుపాయం కలిగిన కోవిడ్ ఆసుపత్రి ని ప్రధాన మంత్రి ప్రారంభించారు. ఈ ఆసుపత్రి ని డిఆర్ డిఒ సహకారం తో సుమారు 37 కోట్ల రూపాయల ఖర్చు తో ఏర్పాటు చేయడమైంది. 170 కోట్ల రూపాయల కు పైగా ఖర్చు తో అభివృద్ధి చేసినటువంటి 'ఇంఫాల్ స్మార్ట్ సిటీ మిషన్' తాలూకు మూడు పథకాల ను ఆయన ప్రారంభించారు. వీటిలో- 'ఇంటిగ్రేటెడ్ కమాండ్ ఎండ్ కంట్రోల్ సెంటర్' (ఐసిపిసి)తో పాటు, ఇంఫాల్ నది లో 'పశ్చిమ నదీముఖ ప్రాంత అభివృద్ధి (ఒకటో దశ)', ఇంకా 'థంగల్ బాజార్ లో మాల్ రోడ్ అభివృద్ధి (ఒకటో దశ)' ప్రాజెక్టు లు ఉన్నాయి.

దాదాపు గా 200 కోట్ల రూపాయల ఖర్చుతో నిర్మించనున్న 'సెంటర్ ఫర్ ఇన్ వెన్సన్, ఇనోవేశన్, ఇంక్యూబేశన్ ఎండ్ ట్రైనింగ్' (సిఐఐఐటి)' కి ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే 240 కోట్ల రూపాయల కు పైగా వ్యయం తో హరియాణా లోని గుడ్ గాఁవ్ లో నిర్మాణం కానున్న 'మణిపుర్ ఇన్స్ టిట్యూట్ ఆఫ్ పెర్ ఫార్మింగ్ ఆర్ట్స్' కు కూడా ప్రధాన మంత్రి శంకుస్థాపన చేశారు.

సమూహాన్ని ఉద్దేశించి ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ, ఇప్పటి నుంచి కొద్ది రోజుల లోపల- అంటే జనవరి 21వ తేదీ నాడు- రాష్ట్ర ప్రతిపత్తి ని పొందిన తరువాతి 50వ వార్షికోత్సవాన్ని మణిపుర్ జరుపుకోనుందన్నారు. ఈ యథార్థాని కి తోడు, భారతదేశం స్వాతంత్ర్యం తాలూకు 75 సంవత్సరాల వేళ 'అమృత్ మహోత్సవాన్ని' జరుపుకొంటూ ఉన్న సందర్భం తనంతట తాను ఒక ప్రధానమైనటువంటి ప్రేరేపణ కూడాను అని ఆయన అన్నారు.

మణిపుర్ ప్రజల ధైర్య సాహసాల కు ప్రధాన మంత్రి శ్రద్ధాంజలి ని ఘటించారు. దేశ ప్రజల లో స్వాతంత్ర్యం పట్ల ఉన్న నమ్మకం అనేది ఇక్కడి మొయిరంగ్ గడ్డ మీద నుంచే మొదలైంది; నేతాజీ సుభాష్ కు చెందిన సైన్యం మొట్టమొదటిసారి గా జాతీయ జెండా ను ఇక్కడ ఎగుర వేసింది అని ప్రధాన మంత్రి గుర్తుచేశారు. భారతదేశం స్వాతంత్ర్యాని కి ప్రవేశ ద్వారం ఈశాన్య ప్రాంతం అని నేతాజీ పేర్కొన్నారు. అటువంటి ఈశాన్య ప్రాంతం ఒక 'న్యూ ఇండియా' యొక్క కలల ను పండించేందుకు ప్రవేశ ద్వారం గా మారుతున్నది అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం లో తూర్పు ప్రాంతం మరియు ఈశాన్య ప్రాంతాలు దేశ పురోగతి కి ఒక వనరు గా నిలుస్తాయి అనే నమ్మకం నాలో ఉంది; ఈ నమ్మకం ఇవాళ ఈ ప్రాంతం సాధించినటువంటి వృద్ధి లో కనిపిస్తోంది అని ఆయన అన్నారు.

ఈ రోజు న ప్రారంభమైన మరియు శంకుస్థాపన జరిగిన అనేక పథకాల కు గాను మణిపుర్ ప్రజల కు ప్రధాన మంత్రి అభినందనలను తెలియజేశారు. పూర్తి సంఖ్యాధిక్యం తో, సంపూర్ణ ప్రభావం తో పాలన సాగిస్తున్నటువంటి ఒక స్థిరమైన ప్రభుత్వాన్ని స్థాపించినందుకు మణిపుర్ ప్రజల కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ స్థిరత్వం వల్లనే, మరి మణిపుర్ ప్రజల ఎంపిక కారణం గానే కిసాన్ సమ్మాన్ నిధి లో భాగం గా వందల కొద్దీ కోట్ల రూపాయల ను 6 లక్షల రైతు కుటుంబాలు అందుకొంటూ ఉండడం; పిఎమ్ గరీబ్ కల్యాణ్ యోజన లో భాగం గా 6 లక్షల పేద కుటుంబాలు ప్రయోజనాల ను పొందుతూ ఉండటం; పిఎమ్ఎవై లో భాగం గా 80 వేల గృహాల నిర్మాణం; ఆయుష్మాన్ యోజన లో భాగం గా 4.25 లక్షల ఉచిత వైద్య చికిత్స; 1.5 లక్షల గ్యాస్ ఉచిత కనెక్శన్ లు; 1.3 లక్షల విద్యుత్తు ఉచిత కనెక్శన్ లు; 30 వేల టాయిలెట్ లు; రాష్ట్రం లోని ప్రతి జిల్లా లో ఆక్సీజన్ ప్లాంటు లు; ఇంకా 30 లక్షల కు పైగా వ్యాక్సీన్ ఉచిత డోజు ల వంటి కార్యసాధన లు సాధ్యపడ్డాయి అని ఆయన స్పష్టం చేశారు.

ప్రధాన మంత్రి పదవి ని తాను స్వీకరించే కన్నా పూర్వమే మణిపుర్ ను అనేక సార్లు సందర్శించినట్లు ప్రధాన మంత్రి గుర్తు కు తెచ్చుకొన్నారు. వారి బాధ ఏమిటన్నది తాను అర్థం చేసుకోగలను అని ఆయన అన్నారు. "ఈ కారణం గానే 2014వ సంవత్సరం తరువాతి కాలం లో నేను దిల్లీ ని ? అదే, భారతదేశం ప్రభుత్వాన్ని మీ ముంగిట కు తీసుకు వచ్చాను." ఈ ప్రాంతాన్ని సందర్శించ వలసింది గా ప్రతి ఒక్క మంత్రి కి, ప్రతి ఒక్క అధికారి కి సూచించడం జరిగింది. "ఈ ప్రాంతాని కి చెందిన అయిదుగురు ప్రముఖులు మంత్రిమండలి లో కీలక శాఖల ను నిర్వహిస్తున్న సంగతి ని మీరు గమనించవచ్చును" అని ప్రధాన మంత్రి పేర్కొన్నారు.

ప్రభుత్వం ఏడు సంవత్సరాలు గా చేస్తున్న కఠోర శ్రమ ను యావత్తు ఈశాన్య ప్రాంతం లో చూడవచ్చు. ప్రత్యేకించి మణిపుర్ లో దీని ఫలితాల ను గమనించవచ్చు అని ప్రధాన మంత్రి అన్నారు. ప్రస్తుతం మణిపుర్ ఒక కొత్త శ్రమ సంస్కృతి కి సంకేతం గా మారుతోంది. ఈ మార్పులు మణిపుర్ సంస్కృతి కి మరియు మణిపుర్ ప్రజల సంరక్షణ కు ఉద్దేశించినవి. సంధానం అనేది కూడా ఈ పరివర్తన లో ఒక మహత్వపూర్ణమైనటువంటి అంశం. అదే విధం గా రచనాత్మకత అంతే ప్రధానమైన విషయం అని ఆయన అన్నారు. రహదారులు మరియు మౌలిక సదుపాయాల కు సంబంధించిన పథకాలు, వీటికి తోడు ఉత్తమమైన మొబైల్ నెట్ వర్క్ లు.. ఇవి అన్నీ కలసి సంధానాన్ని పటిష్ట పరచగలుగుతాయి అని ప్రధాన మంత్రి వివరించారు. సిఐఐటి స్థానిక యువత లో రచనాత్మకత కు, నూతన ఆవిష్కరణ సంబంధి స్ఫూర్తి కి తోడ్పడుతుంది అని ఆయన అన్నారు. ఆధునిక కేన్సర్ ఆసుపత్రి అనేది సంరక్షణ తాలూకు మరొక పార్శ్వాన్ని జోడిస్తుంది. మరి అదే మాదిరి గా మణిపుర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పెర్ ఫార్మింగ్ ఆర్ట్, గోవింద్ జీ మందిరం పునర్ నవీకరణ లు సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తాయి అని ఆయన చెప్పారు.

ఈశాన్య ప్రాంతాల కోసం 'యాక్ట్ ఈస్ట్' విధానాన్ని తమ ప్రభుత్వం సంకల్పం గా తీసుకుంది అని ప్రధాన మంత్రి అన్నారు. దైవం ఎన్నో విధాలైన ప్రాకృతిక వనరుల ను ప్రసాదించడం వల్ల ఈ ప్రాంతాని కి సామర్థ్యం బాగా దండి గా ఉంది అని ఆయన అన్నారు. ఇక్కడ అభివృద్ధి కి, పర్యటన కు ఎంతో ఆస్కారం ఉంది అని ఆయన వ్యాఖ్యానించారు. ఈశాన్య ప్రాంతం లో ఉన్నటువంటి ఈ అవకాశాల ను అందిపుచ్చుకోవడం కోసం ఇక్కడ ప్రస్తుతం పనులు జరుగుతూ ఉన్నాయి అని కూడా ఆయన తెలిపారు. ఈశాన్య ప్రాంతం ప్రస్తుతం భారతదేశం అభివృద్ధి కి ఒక ప్రవేశద్వారం గా మారుతోంది అని ఆయన వివరించారు.

మణిపుర్ దేశాని కి అత్యంత అరుదైనటువంటి రత్నాల ను ప్రసాదిస్తున్న రాష్ట్రాల లో ఒక రాష్ట్రం గా ఉంటూ వచ్చింది అని ప్రధాన మంత్రి అన్నారు. ఇక్కడి యువత, మరీ ముఖ్యం గా మణిపుర్ కుమార్తె లు, దేశాన్ని ప్రపంచం అంతటా గర్వపడేటట్టు చేశారు. మరీ ముఖ్యం గా దేశం లో యువత మణిపుర్ క్రీడాకారుల నుంచి ప్రేరణ ను స్వీకరిస్తోంది అని ఆయన అన్నారు.

రెండు ఇంజిన్ ల ప్రభుత్వం నిరంతర ప్రయాస ల ఫలితం గా ప్రస్తుతం ఈ ప్రాంతం లో ఎలాంటి ఉగ్రవాదం తాలూకు మంటలు గాని, మరి అభద్రత గాని లేదు అని ప్రధాన మంత్రి అన్నారు. దానికి బదులు గా ఇక్కడ శాంతి, ఇంకా అభివృద్ధి ల తాలూకు వెలుగులు ప్రసరిస్తూ ఉన్నాయి అని ఆయన అన్నారు. ఈశాన్య ప్రాంతం లో వందల కొద్దీ యువతీ యువకులు ఆయుధాల ను వదలిపెట్టి అభివృద్ధి తాలూకు ప్రధాన స్రవంతి లో చేరుతున్నారు అని ఆయన అన్నారు. దశాబ్దాల తరబడి పెండింగు పడ్డ ఒప్పందాల ను వర్తమాన సన్కారు చరిత్రాత్మకమైనటువంటి ఒప్పందాలు గా కొలిక్కి తెచ్చింది అని ఆయన చెప్పారు. 'దిగ్భంధాని కి లోనైన రాష్ట్రం' గా ఉంటూ వచ్చిన మణిపుర్ అంతర్జాతీయ వ్యాపారాని కి బాట పరుస్తున్నటువంటి ఒక రాష్ట్రం గా మారింది అని ఆయన అన్నారు.

ఇరవై ఒకటో శతాబ్దం లోని ఈ దశాబ్ది మణిపుర్ కు చాలా ముఖ్యమైనటువంటిది అని ప్రధాన మంత్రి అన్నారు. గతం లో చాలా కాలాన్ని నష్టపోవడం శోచనీయం అని ఆయన అన్నారు. అటువంటి ఒక్క క్షణం అయిని ఇప్పుడు లేదు అని కూడా ఆయన అన్నారు. "మనం మణిపుర్ లో స్థిరత్వాన్ని కూడా కాపాడవలసి ఉంది; అలాగే మణిపుర్ ను అభివృద్ధి తాలూకు కొత్త శిఖరాల కు తీసుకు పోవలసి ఉంది. మరి రెండు ఇంజిన్ ల ప్రభుత్వమొక్కటే ఈ పని ని చేయగలదు" అని ఆయన నొక్కి చెప్పారు.

ఐటీలో ఖమ్మం మేటి..

హైదరాబాద్, జనవరి 4:రాష్ట్రంలో ఏర్పాటైన ఐటీ హబ్‌ల్లో ఖమ్మం సమగ్రమైన ఐటీ హబ్‌గా నిలిచిందని మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పేర్కొన్నారు. మంగళవారం మంత్రి కేటీఆర్ ను కలిసి ఖమ్మం ఐటీ హబ్ ప్రథమ వార్షిక నివేదిక 2021 ను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అందజేశారు.

ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు వివిధ రంగాల్లో వృత్తి నైపుణ్యతను పెంపొందించేందుకు టాస్క్ ద్వారా శిక్షణ ఇస్తున్నట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. 2020-21 ఆర్థిక సంవత్సరంలో ఐటీ ఎగుమతుల విలువ రూ.1,45,522 కోట్లుగా నమోదైందని అన్నారు. రాష్ట్రంలో ఐటీ రంగంలో 6,28,615 మందికి ఉద్యోగాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ద్వితీయశ్రేణి నగరాల్లో సమాచార సాంకేతికతను విస్తరిస్తున్నామని 1800 అంకురాలు(స్టార్టప్స్) ఏర్పాటయ్యాయని మంత్రి కేటీఆర్ తెలిపారు.

'ప్రసాద్ స్కీం' పనులను పరిశీలించిన -మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, జనవరి 4:కోరిన కోరికలు తీర్చే జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర గ్రూపు దేవస్థానాలయాలను దర్శించుకోవడంతో ఎంతో అనుభూతి పొందుతారు భక్తులు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రసాద్ పథకంలో జోగుళాంబ దేవస్థానానికి చోటు దక్కింది. దక్షిణ కాశీగా పేరొందిన అలంపూర్‌లోని జోగులాంబ శక్తి పీఠాన్ని ప్రసాద్ స్కీమ్‌లోకి కేంద్ర ప్రభుత్వం చేర్చింది. రూ. 36 కోట్ల, 73 లక్షలు కేటాయించింది. ఈ నిధులతో జోగులాంబ అమ్మవారి ఆలయంతోపాటు అనుబంధంగా ఉన్న పలు ఆలయాల్లో సకల సౌకర్యాలు కల్పించనున్నారు. ఇప్పటికే జోగుళాంబ దేవస్థానం ప్రసాద్ పథకం ద్వారా భక్తుల సౌకర్యాల నిమిత్తం చేపట్టే అభివృద్ధి పనులకు రూపకల్పన చేశారు.

అందులో భాగంగా టూరిజం ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో ఎంపీ రాములు, స్థానిక ఎమ్మెల్యే అబ్రహం , ఇతర శాఖల సిబ్బందితో ప్రసాద్ స్కీం పనుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం శివరాత్రి పర్వదినాల్లో వచ్చే భక్తులకు దేవస్థానం ఏర్పాటు చేసే సౌకర్యాలు సరిపోవడం లేదు. దీంతో వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. వాటిలో ముఖ్యంగా వసతి గదుల క్యూ లైన్లు, ప్రత మండపాలు , అన్నదానం, అంతరాయం వల్ల అనేక ఇబ్బందులు పడుతున్నారు. వీటిని దృష్టిలో పెట్టుకునే దేవస్థానం ప్రసాద్ పథకం ద్వారా ఈ ఇబ్బందులకు శాశ్వత పరిష్కారానికి ప్రయత్నిస్తున్నారు. అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయ తుంగభద్ర నది తీరాన ప్రారంభమైన ప్రసాద్ స్కీం పనులను పరిశీలించి అనంతరం జోగులాంబ బాలబ్రహ్మేశ్వర ఆలయాలను దర్శించుకున్నారు అనంతరం బి ఆర్ ఎస్ ఫంక్షన్ హాల్లో సమీక్ష సమావేశం నిర్వహించారు.

తెలంగాణ గజ గజ.. వణికిస్తున్న చలిగాలులు.. హైదరాబాద్ లో ఎల్లో అలర్ట్..

హైదరాబాద్, జనవరి 4:తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో రాత్రివేళ ఉష్ణోగ్రతలు బాగా పడిపోయాయి. సోమవారం తెల్లవారుజామున సగటు కనిష్ట ఉష్ణోగ్రత 15.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంతేకాకుండా హైదరాబాద్ నగర శివారులోని శేరిలింగంపల్లిలో అతి తక్కువగా 11.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రిపోర్టు అయినట్లు వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ (టాఆఖా) అంచనా ప్రకారం.. రానున్న రెండు మూడు రోజుల్లో రాత్రి ఉష్ణోగ్రతలు మరింత తగ్గే అవకాశం ఉంది. హైదరాబాద్ శివార్లలోని కాప్రా, హయత్‌నగర్, ఉప్పల్, మలక్‌పేట్, ఫలక్‌నుమా వంటి ప్రాంతాల్లో మంగళ, బుధ, గురువారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గముఖం పట్టవచ్చని వాతావరణ అధికారులు అంచనా వేశారు.

హైదరాబాద్ లో రాత్రి ఉష్ణోగ్రతలు రెండు నుంచి మూడు డిగ్రీలు తగ్గే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.. 15 డిగ్రీల సెల్సియస్ నుండి 11 డిగ్రీల సెల్సియస్ వరకు పడిపోయే చాన్స్ ఉందని తెలిపారు. భయంకరమైన చలిగాలుల నేపథ్యంలో హైదరాబాద్ సిటీలో 3 రోజుల పాటు ఎల్లో అలర్ట్ ను వాతావరణ శాఖ ప్రకటించింది.

తెలంగాణలోని పలు జిల్లాల్లో కూడా రాత్రిపూట ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువగా నమోదవుతున్నాయి. సోమవారం కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాలో అత్యల్ప కనిష్ట ఉష్ణోగ్రత 10.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. రానున్న రెండు రోజుల్లో మేడ్చల్- మల్కాజిగిరి, నిర్మల్, జనగాం, సిద్దిపేట, వికారాబాద్ సహా పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 3 నుంచి 4 డిగ్రీల దాకా తగ్గే అవకాశం

జీవితంలో యోగ భాగంగా కావాలి : మంత్రి సబితారెడ్డి

హైదరాబాద్, జనవరి 4:ప్రతి ఒక్కరి జీవితంలో యోగ భాగం కావాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు . మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యంగా ఉండటానికి యోగ దోహద పడుతుందన్నారు. అరుణ యోగా ట్రైనింగ్ అండ్ రీసెర్చ్ ఇన్ స్టిట్యూట్ లో శిక్షణ పూర్తి చేసుకున్న 30 మందికి మంగళవారం మంత్రి నివాసంలో సర్టిఫికెట్లు ప్రధానం చేసారు. మన దేశంతో పాటు పలు ప్రపంచ దేశాల వారికి యోగ శిక్షణ ఇస్తున్న యోగ గురు అరుణ దేవిని మంత్రి అభినందించారు. గత 30 ఏళ్లుగా ఆమె అందిస్తున్న సేవలను మంత్రి కొనియాడారు.

భాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం- ప్రభుత్వ విప్ బాల్క సుమన్

హైదరాబాద్, జనవరి 4:వివాహిత హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వ విప్ బాల్క సుమన్ కోరారు.

చెన్నూరు నియోజకవర్గం లోని కోటపల్లి మండలం లింగన్నపేట లో సౌందర్య కుటుంబాన్ని పరామర్శించారు. హత్య కేసులో నిందితులను కఠినంగా శిక్షించాలని రామగుండం సిపి, జిల్లా కలెక్టర్ ను ఫోన్ లో ఆదేశించారు. ఈ సంఘటన దురదృష్టమని భవిష్యత్ లో ఇలాంటివి పునరావృతం కాకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాల న్నారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని తక్షణ సాయం కింద లక్ష రూపాయలు కుటుంబ సభ్యులకు అందజేశారు.

ఆర్‌కే బీచ్ విషాదం.. మృతుల కుటుంబాలకు మంత్రి తలసాని ఆర్థిక సహాయం

హైదరాబాద్, జనవరి 4:విశాఖలోని ఖీఐ బీచ్ లో గల్లంతై మృతి చెందిన తెలంగాణ యువకుల కుటుంబాలను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. విహార యాత్ర కోసం స్నేహితులతో కలిసి విశాఖపట్నం వెళ్ళి అక్కడి ఖీఐ బీచ్ లో రసూల్ పురాకు చెందిన శివ, శివ కుమార్, అజీజ్ అనే ముగ్గురు యువకులు మృతి చెందారు. ఈ నేపథ్యంలో వారి మృతదేహాలను వారి నివాసాలకు తీసుకొచ్చారు. మృతుల కుటుంబ సభ్యులను మంత్రి శ్రీనివాస్ యాదవ్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయలు చొప్పున మూడు కుటుంబాలకు మూడు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వ్యక్తిగతంగా అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి తలసాని మాట్లాడుతూ మృతులు ముగ్గురు అతి చిన్న వయసు కలిగిన వారని, నిరుపేద కుటుంబాలకు చెందిన వారని అన్నారు. ఈ సంఘటన చాలా బాధాకరం అని చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వ సహాయం అందించి ఆదుకునేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంత్రి వెంట కంటోన్మెంట్ ఎమ్మెల్యే సాయన్న, మాజీ వైస్ చైర్మన్ జక్కుల మహేశ్వర్ రెడ్డి ఉన్నారు.

చరిత్రలో నేటినిజం

కం॥ పూగంబెడి భూమిలో
ప్రొగెడి నడి గంటలోనె-మెడలిడ గాలుడున్
కాగధియై చెలఁబాండెడ
యోగీంద్రున్-పరమహంస యోగానందున్ ॥

(జనవరి 5 పరమహంస యోగానంద జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

కరోనా వ్యాక్సీన్ ఇండియన్ ఛాంపియన్స్

అసాధారణ ముందు చూపు, అసమాన ధైర్యం, ప్రేరణాత్మక చొరవ లాంటి సుగుణాలు కలిగిన భారతీయ విజేతలు కోవిడ్-19 మహమ్మారిని కట్టడి చేయడానికి దేశ విదేశాలకు కరోనా టీకాలను రూపొందించి, అందుబాటులో ఉంచడంలో సఫలీకృతమైన వ్యక్తులు మన భారతీయులని సగర్వంగా చెప్పడానికి సదవకాశం దొరికింది. మన వ్యాక్సీన్ సిటీ హైదరాబాద్‌కు చెందిన భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్ అండ్ సిఈఓ 'కృష్ణ ఎల్ల'తో పాటు పూనేకు చెందిన సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా(సిఐఐ) సిఈఓ 'అదర్ పూనావాలా'ల కృషితో ప్రజలు టీకాలు వేయించుకొని వైరస్ విపత్తు నుంచి ఊపిరి పీల్చుకుంటున్నారు. తొలి కరోనా అలను ధీటుగా ఎదుర్కొని, 2వ అలతో ప్రాణాలను అరచేతులో పెట్టుకొని, కొందర్ని పోగొట్టుకొని, మరి కొందర్ని ప్రాణాల అంచులోంచి దక్కించుకొని ఊపిరి పీల్చుకుంటున్న వేళ మరో ఒమిక్రాన్ వేరియంట్ వ్యాప్తి భయంతో, 3వ అల రావచ్చన్న హెచ్చరికలతో ప్రజానీకం భయం గుప్పిట్లో చిక్కి గడియలు లెక్కిస్తున్నారు. ఈ రెండు కంపెనీల చలవతో నేటికి భారత్‌లో అర్హత కలిగిన వారిలో 87 శాతం ప్రజలు తొలి డోసును, 55 శాతం రెండవ డోసును తీసుకున్నారు. హిమాచల్‌లో 100 శాతం, జె అండ్ కెలో 96 శాతం, గోవాలో 95 శాతం రెండవ డోసు తీసుకోగా తెలంగాణలో 55 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 77 శాతం రెండవ డోసు తీసుకున్నట్లు తేలింది.

కృష్ణ ఎల్ల, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్:

తమిళనాడుకు చెందిన తిరువాళ్లూర్ జిల్లా తిరుత్తని గ్రామంలోని వ్యవసాయ కుటుంబంలో 1969లో జన్మించిన కృష్ణ ఎల్ల తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డిగ్రీ, బెంగుళూరు వ్యవసాయ వైజ్ఞానికశాస్త్ర విశ్వవిద్యాలయంలో పిజీ పూర్తి చేసి, రోటరీ ఫెల్లోషిప్‌తో హవాయి యూనివర్సిటీలో యంయస్ చదువులు, యూనివర్సిటీ ఆఫ్ విస్కాన్సిన్-మడిసన్‌లో డాక్టరేట్ పట్టా పొందారు. ప్రముఖ ఫార్మా, లైఫ్ సైన్సెస్ కంపెనీ 'బేయర్'లో ఉద్యోగం చేసిన అనంతరం ఉన్నత విద్య, పరిశోధనల నిమిత్తం అమెరికాకు పయనమయ్యారు. కొంత కాలం తరువాత తిరిగి వచ్చి హైదరాబాద్‌లో భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ అనే చిన్న కంపెనీకి చైర్మన్-యండిగా విధులు నిర్వహిస్తూ ఔత్సాహిక పారిశ్రామిక వేత్తగా తన సృజనను పరిచయం చేయడం ప్రారంభించారు. 1996లో తన జీవిత భాగస్వామి సుచిత్రతో కలిసి 'వ్యాక్సీన్ క్యాపిటల్ ఆఫ్ ది వరల్డ్'గా పేరొందిన హైదరాబాద్‌లో బయోటెక్ నాలెడ్జ్ పార్క్ అయిన 'జీనోమ్ వ్యాలి' స్థాపనలో తన వంతు బాధ్యతను నిర్వహించారు. 1999లో హెపటైటిస్ బి టీకాను తయారు చేసి ? 10/- అతి చవకైన ధరకు 400 మిలియన్ డోసులను 65 దేశాలకు అందిస్తూ అందరి దృష్టి ఆకర్షించారు. భారత్‌లో తొలిసారిగా 'స్వైన్ ఫ్లూ' టీకాలను ప్రవేశ పెట్టిన కృష్ణ ఎల్ల కంపెనీ ద్వారా తొలి 'జీకా వైరస్' టీకాను తయారు చేసి ప్రపంచానికి అందించారు. కృష్ణ ఎల్ల కృషిని గుర్తించిన అంతర్జాతీయ ప్రభుత్వాలు/ప్రభుత్వేతర సంస్థలు జెఆర్‌డి టాటా ఆవార్డు, మరీకో ఇన్నొవేషన్ ఆవార్డు, ఏసియా పసిపిక్ లీడర్‌షిప్ ఆవార్డు, బయో-ఏసియా జీనోమ్ ఆవార్డు, హెల్త్‌కేర్ ఇండస్ట్రీ ఆవార్డు లాంటి పలు పురస్కారాలు పొందినప్పటికీ అతి సాధారణ జీవన విధానాన్ని ఇష్టపడతారు. యువ శాస్త్రవేత్తల్ని ప్రోత్సహించడాన్ని నమ్మిన ఎల్ల కృష్ణ తన కంపెనీ అభివృద్ధిలో వారి నైపుణ్యాన్ని వినియోగించుకుంటున్నారు.

16 జనవరి 2021న ప్రారంభమైన కరోనా టీకా కార్యక్రమం ద్వారా స్వదేశీ పరిజ్ఞానంతో భారత్ బయోటెక్ (ఐసియంఆర్, యన్ఐవిల సహకారంతో) రూపొందించిన 'కోవాగ్జీన్'తో పాటు ఆక్స్‌ఫోర్డ్ ఆస్ట్రాజెనికా సహకారంతో సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (సిఐఐ) తయారు చేసిన 'కోవిషీల్డ్' టీకాలను 140 కోట్ల వరకు (డిసెంబర్ 27 నాటికి) భారతీయ వయోజనులకు అందించి వ్యాక్సీన్ హీరోలుగా కొనియాడహడుతున్నారు. నేడు పంపిణి చేయడానికి 20 మిలియన్ల కోవాగ్జీన్ టీకా డోసులను అందుబాటులో ఉంచారు. భారత్ బయోటెక్ సంస్థ ద్వారా పిల్లలకు కూడా వేయడానికి 'నాసల్ వ్యాక్సీన్ (ముక్కులో వేయడానికి టీకా)' బూస్టర్ డోస్‌గా కూడా త్వరలో 60కి పైగా దేశాల్లో అందుబాటులోకి రానున్నది.

అదర్ పూనావాలా, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా:

14 జనవరి 1981న జన్మించిన పూనా లాలా ప్రస్తుతం సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (యస్ఐఐ) పూనెలో బిషప్/ఎడ్మండ్ పాఠశాలల్లో పాఠశాల విద్య, యూనివర్సిటీ ఆఫ్ వెస్ట్‌మినిస్టర్ యూనివర్శిటీలో ఉన్నత విద్య పూర్తి చేశారు. 2001లో యస్ఐఐలో సిఈఓగా చేరిన పూనావాలా పలు దేశాలకు డ్యూహెచ్ఓ, యూనిసెఫ్‌ల సహకారంతో టీకాలు/ఔషధాలను అందిస్తున్నారు. 2015 నాటికి 140 దేశాలకు ఔషధాల ఎగుమతులు చేస్తున్నారు. తండ్రీ సైప్రస్ పూనా వాలా భారత్‌కు చెందిన బిలియన్ వ్యాపారిగా పేరు గాంచారు. 2021లో ప్రపంచంలోనే అతి పెద్ద ఐదు కంపెనీల్లో ఒకటిగా నిలిచిన సిఐఐ ప్రస్తుత అత్యధిక ఆస్తుల విలువ (దాదాపు 19 బిలియన్ డాలర్లుగా) కలిగి భారత కంపెనీగా కోవిషీల్డ్ టీకాలను తయారు చేస్తున్నది. ఆక్స్‌ఫర్డ్ ఆస్ట్రాజెనికా రూపొందిందని కోవిషీల్డ్ టీకాలను సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా (సిఐఐ) తయారు చేస్తూ పలు దేశాలకు అందిస్తున్నది. సిఐఐ అధినేత అదర్ పూనావాలా అసాధారణ కృషికి మెచ్చిన ప్రపంచ సమాజం హుమానిటేరియన్, అచీవర్స్, ఫార్చూన్ మాగజీన్, ఎంటర్‌ప్రైసర్, టైమ్స్-100 పురస్కారాలు పొందారు. నేడు భారత్‌లో కోవిషీల్డ్ టీకాల 1.25 బిలియన్ డోసులు అందిస్తూ సిఐఐ అగ్రస్థానంలో నిలిచింది. సిఐఐ ద్వారా మాసానికి 240 మిలియన్ల కరోనా టీకా డోసులను సరఫరా చేసే స్థితికి చేరారు. ప్రస్తుతం 85 శాతం విదేశీ వ్యాపారంతో 2019-20లో ?5,200 కోట్ల గడించిన యస్ఐఐ కంపెనీ అధినేత పూనావాలా జీవనశైలి ఖరీదైనదిగా ఉంటుంది. సమాజ సేవకుడిగా అదర్ పూనావాలా-నతాషా దంపతులు కంపెనీ ద్వారా నిరు పేదల ప్రజారోగ్యం, నీటి వనరులు, పారిశుద్ధ్యం, విద్యా వసతులను కల్పిస్తున్నారు.

భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్ కృష్ణ ఎల్ల, సీరమ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియా సిఈఓ అదర్ పూనావాలాలు తమ పట్టుదల, అంకిత భావం, అత్యంత సాహస ధోరిణిలతో దేశ జనాభాకు సరిపోయే కరోనా టీకా డోసులను అందించడంతో భారతీయులకు పెను ప్రమాదం, ప్రాణాపాయం తప్పినట్లు అయ్యింది. ప్రపంచానికే టీకా డోసులు సరఫరా చేసిన, చేస్తున్న భారతమాత సిగలో పువ్వులుగా కృష్ణ ఎల్ల, అదర్ పూనావాలాలు వెలుగులు చిమ్ముతూ, దేశానికే గర్వకారణంగా నిలుస్తున్నారు. ఈ సందర్భంగా కరోనా టీకా విజేతలైన ఎల్ల, అదర్‌లకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

భద్రతా సవాళ్ళపై ఉన్నతస్థాయి సమావేశం

న్యూఢిల్లీ, జనవరి 4:దేశంలో కొనసాగుతున్న ముప్పు పరిస్థితులు, ఉద్భవిస్తున్న భద్రతా సవాళ్ళను సమీక్షించేందుకు కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా ఉన్నత స్థాయి భద్రతా సమావేశాన్ని నిర్వహించారు.

తీవ్రవాదం, అంతర్జాతీయ తీవ్రవాద గ్రూపులు, తీవ్రవాదులకు ఆర్థిక సహాయం, నార్కో టెర్రరిజం (చట్టవ్యతిరేకంగా మాదకద్రవ్యాల వ్యాపారంలో నిమగ్నమైన తీవ్రవాదం), వ్యవస్థీకృత నేరాలు- తీవ్రవాదుల సంబంధం, సైబర్ స్పేస్‌ను అక్రమ ఉపయోగం, విదేశీ తీవ్రవాదుల కదలికలతో ఏర్పడిన నిరంతర ముప్పును పట్టిచూపుతూ, కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య మెరుగైన సహకారం, సమన్వయ అవసరాన్ని హోం మంత్రి నొక్కి చెప్పారు.

దేశంలోని భద్రతా ఏజెన్సీలు, ముఖ్యంగా కేంద్ర నిఘా సంస్థలు, సిఏపిఎఫ్‌లు, సాయుధ దళాల నిఘా విభాగాలు, రెవిన్యూ, ఆర్థిక నిఘా సంస్థల అధిపతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల డిజిపిలు కూడా వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్ర, రాష్ట్ర భద్రతా సంస్థల మధ్య మెరుగైన సహకారం, సమన్వయాలతో, నిరంతరం పరివర్తన చెందుతున్న సిటి, భద్రతా సవాళ్ళను ఎదుర్కోవలసిన అవసరాన్ని హోం మంత్రి నొక్కి చెప్పారు

న్యూస్ ఆన్ ఎయిర్ రేడియో లైవ్-స్ట్రీమ్ గ్లోబల్ ర్యాంకింగ్స్

న్యూఢిల్లీ, జనవరి 4: 'న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్'లో ఆల్ ఇండియా రేడియో లైవ్ స్ట్రీమ్‌లు ర్యాంకింగ్స్‌ను వెల్లడించారు. ప్రపంచంలోని అగ్ర దేశాల (భారతదేశం మినహా) అత్యంత ప్రజాదరణ పొందిన తాజా ర్యాంకింగ్‌లలో ఫిజీ యునైటెడ్ స్టేట్స్‌ను తప్పించి మొదటి స్థానంలో నిలిచింది. యునైటెడ్ కింగ్‌డమ్ మరియు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ వరుసగా 7వ మరియు 10వ స్థానానికి పడిపోయాయి. న్యూజిలాండ్, జపాన్, ఐర్లాండ్ మరియు పపువా న్యూ గినియా టాప్ 10లోకి ప్రవేశించగా, సింగపూర్, సౌదీ అరేబియా, పాకిస్థాన్ మరియు కువైట్ టాప్ లిస్ట్‌లో లేకుండా పోయాయి. ప్రపంచవ్యాప్త అగ్రశ్రేణి ఆల్ ఇండియా రేడియో స్ట్రీమ్‌లలో (భారతదేశం మినహా) ఏఐఆర్ పంజాబీ, ఏఐఆర్ తెలుగు, ఏఐఆర్ చెన్నయి రెయిన్‌బో, అస్మిత ముంబయిలు మొదటి పది స్థానాల్లోకి తిరిగి చేరాయి. ఈ మేటి జాబితాలలో ఏఐఆర్ మంగళూరు, ఏఐఆర్ రాగం, వరల్డ్ సర్వీస్ 1, వివిధ్ భారతి ఢిల్లీ స్థానభ్రంశం చెందాయి. న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌లో అగ్రశ్రేణి ఆల్ ఇండియా రేడియో ప్రత్యక్ష ప్రసారాల (భారతదేశం మినహా) ర్యాంకింగ్‌ల ప్రకారం, అగ్ర రాజ్యం అమెరికా, యునైటెడ్ కింగ్‌డమ్, కెనడా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, జర్మనీలలో ఏఐఆర్ పంజాబీ బాగా ప్రాచుర్యం పొందింది. ప్రసార భారతి సంస్థ యొక్క అధికారిక యాప్ అయిన న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌లో ఆల్ ఇండియా రేడియో యొక్క 240 కంటే ఎక్కువ రేడియో సేవలు ప్రత్యక్ష ప్రసారం చేయబడ్డాయి. న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌లోని ఈ ఆల్ ఇండియా రేడియో స్ట్రీమ్‌లు భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా 85 కంటే ఎక్కువ దేశాలలో పెద్ద సంఖ్యలో శ్రోతలను కలిగి ఉన్నాయి. కేవలం భారతదేశం కాకుండా న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌లోని ఏఐఆర్ లైవ్ స్ట్రీమ్‌లు అత్యంత జనాదరణ పొందిన అగ్ర దేశాల గురించి ఇక్కడ సంగ్రహావలోకనం ఉంది; ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలలో న్యూస్‌ఆన్ ఎయిర్ యాప్‌లో అగ్ర ఆల్ ఇండియా రేడియో ప్రసారాలు. దేశ వారీగా వేరువేరుగా ఉండడం గమనించవచ్చు. ఈ ర్యాంకింగ్‌లు డిసెంబర్ 1 నుండి డిసెంబర్ 15, 2021 వరకు అందిన సమాచారం ఆధారంగా అందించబడ్డాయి.

సూర్యాపేట ర్యాగింగ్ కేసులో ఆరుగురు విద్యార్థులు సస్పెండ్

సూర్యాపేట, జనవరి 4: సూర్యాపేట ర్యాగింగ్ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. ఈ ఘటన పట్ల ప్రభుత్వం సీరియస్ అయ్యింది. ఘటనకు పాల్పడిన ఆరుగురు విద్యార్థులను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు డిఎంఈ రమేష్ రెడ్డి. హైదరాబాద్‌లోని మైలార్‌దేవులపల్లి ప్రాంతానికి చెందిన సాయికుమార్?సూర్యాపేట మెడికల్ కాలేజ్‌లో చదువుతూ కళాశాలకు చెందిన హాస్టల్‌లో ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈనెల 1న కొందరు సీనియర్ విద్యార్థులు నూతన సంవత్సర వేడుకలు జరుపుకుంటూ మద్యం సేవించారు. సాయికుమార్‌ను తమ గదికి రావాలని పిలిచారు. సీనియర్ల గదికి వెళ్లిన విద్యార్థి సాయికుమార్ పట్ల సీనియర్లు అనుచితంగా ప్రవర్తించారు.

బయోడేటా చెప్పాలని, దుస్తులు విప్పించి ఇబ్బందులకు గురిచేస్తూ సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. సీనియర్ల నుంచి తప్పించుకున్న విద్యార్థి తన తండ్రికి ఫోన్ చేసి విషయం తెలియజేశారు. వెంటనే అతడు 100కు ఫోన్ చేయడంతో పట్టణ పోలీసులు హాస్టల్‌కు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. ర్యాగింగ్ కు పాల్పడిన సీనియర్ విద్యార్థులను ఒక్కొక్కరిగా ప్రశ్నించి వారిపై కేసులు నమోదు చేసారు. ఈ ఘటనకు పాల్పడిన 2019-20 బ్యాచ్ కి చెందిన జె మహేందర్, జి శశాంక్ , పి శ్రవణ్, ఏ. రంజిత్ సాయి, కె హరీష్, బి సుజిత్ లను ఏడాది పాటు సస్పెండ్ చేసిన డిఎంఈ.. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

నీట్ 3.0, ఏఐసీటీఈ నిర్దేశించిన సాంకేతిక పుస్తకాలను ప్రాంతీయ భాషల్లో విడుదల చేసిన కేంద్ర విద్యా శాఖ మంత్రి

న్యూఢిల్లీ, జనవరి 4:సాంకేతిక విద్యకు సంబంధించిన సమస్యలను పరిష్కరించి, విద్యార్థులకు పాఠ్య అంశాలను ఒకే వేదిక మీద అందించాలన్న లక్ష్యంతో రూపొందించిన నీట్ 3.0ని కేంద్ర విద్యా, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ ప్రారంభించారు. ప్రాంతీయ భాషల్లో ముద్రించిన ఏఐసీటీఈ నిర్దేశించిన సాంకేతిక పుస్తకాలను కూడా మంత్రి విడుదల చేశారు.

ఈ సందర్భంగా మాట్లాడిన శ్రీ ధర్మేంద్ర ప్రధాన్ డిజిటల్ వ్యత్యాసాన్ని తగ్గించి ప్రపంచానికి అవసరమైన విజ్ఞాన ఆధారిత నైపుణ్యాన్ని నీట్ అందిస్తుందని అన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన విద్యార్థులకు ఇది ప్రయోజనం కలిగిస్తుందని మంత్రి అన్నారు. భారతదేశంతో పాటు ప్రపంచ దేశాల విజ్ఞాన ఆధారిత అవసరాలను తీర్చడంలో నీట్ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. నీట్ లో 58 జాతీయ అంతర్జాతీయ సాంకేతిక విద్య అంకుర సంస్థలు సభ్యత్వం కలిగి ఉన్నాయని మంత్రి వివరించారు. విద్యా బోధనను మెరుగుపరచడానికి, ఉపాధి నైపుణ్యాలను అభివృద్ధి చేయడానికి , ఇతర సమస్యలను పరిష్కరించేందుకు 100 కోర్సులు, ఇ-వనరులను అందిస్తున్నాయని మంత్రి తెలియజేశారు. చదివిన దానిని మరచి పోకుండా చూసి గుర్తుంచుకునేలా చూసే అంశంలో నీట్ లాంటి డిజిటల్ వ్యవస్థలు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు.

స్కిల్ ఇండియాతో నీట్ కోర్సులను అనుసంధానం చేయాలని ఏఐసీటీఈ కి మంత్రి సూచించారు. దీనివల్ల నైపుణ్యం అభివృద్ధి చెందుతుందని, యువతకి ఉపాధి అవకాశాలు మరింత అందుబాటులోకి వచ్చి యువతను భవిష్యత్తు కోసం సిద్ధం చేయడానికి అవకాశం కలుగుతుందని శ్రీ ప్రధాన్ అన్నారు. సాధ్యమైనంత తక్కువ ధరకు విద్యా వనరులను అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన ఏఐసీటీఈ, ఎడ్-టెక్ సంస్థలకు సూచించారు. నీట్ 3.0 లో సభ్యులుగా ఉన్న అంతర్జాతీయ ఎడ్-టెక్ సంస్థలు, భారత అంకుర సంస్థలను మంత్రి అభినందించారు. అందిరికి విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు కలిసి పనిచేయాలని ఆయన ఎడ్-టెక్ సంస్థలకు పిలుపు ఇచ్చారు. అయితే, విద్యా రంగంలో గుత్తాధిపత్యానికి, దోపిడీకి తావు లేదని ఎడ్-టెక్‌లు గుర్తుంచుకోవాలని ఆయన అన్నారు.

సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు చెందిన దాదాపు 12 లక్షల మంది విద్యార్థులకు నీట్ 3.0 కింద 253 కోట్ల రూపాయల విలువైన ఉచిత ఎడ్-టెక్ కోర్సు కూపన్‌లను అందించడం పట్ల మంత్రి హర్షం వ్యక్తం చేశారు. 2022 కొత్త సంవత్సరంలో ఇది ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నుంచి విద్యార్థి సమాజానికి అందిన అతిపెద్ద బహుమతి అని ఆయన అన్నారు. 21వ శతాబ్దంలో భారతదేశం ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు నాయకత్వం వహించి , వాణిజ్యం , ఆర్థిక వ్యవస్థకు అత్యంత ప్రాధాన్య మార్కెట్‌గా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.

ప్రాంతీయ భాషల్లో సిద్ధం చేసిన సాంకేతిక పుస్తకాల అంశంపై మాట్లాడిన శ్రీ ప్రధాన్ మన విభిన్న భాషలు మన బలమని అన్నారు. వినూత్న సమాజ నిర్మాణానికి భాషను వినియోగించుకోవడం కీలకమని అన్నారు . ప్రాంతీయ భాషలో నేర్చుకోవడం వల్ల విమర్శనాత్మక ఆలోచనా సామర్థ్యం మరింత పెరిగి యువత అంతర్జాతీయ గుర్తింపు పొందేలా వీలు కల్పిస్తుందని ఆయన అన్నారు.

విద్యా రంగంలో అత్యుత్తమ-అభివృద్ధి చెందిన సాంకేతిక పరిష్కారాల వినియోగాన్ని ఒకే వేదికపై అందించి యువతకు ఉపాధిని పెంపొందించడానికి, అభ్యాసకుల సౌలభ్యం కోసం నేషనల్ ఎడ్యుకేషనల్ అలయన్స్ ఫర్ టెక్నాలజీ (నీట్) కృషి చేస్తోంది. ఈ పరిష్కారాలు సముచిత ప్రాంతాలలో మెరుగైన అభ్యాస ఫలితాలు మరియు నైపుణ్యం అభివృద్ధి కోసం వ్యక్తిగతీకరించిన మరియు అనుకూలీకరించిన అభ్యాస అనుభవం కోసం కృత్రిమ మేధస్సును ఉపయోగిస్తాయి. సామాజికంగా మరియు ఆర్థికంగా వెనుకబడిన పెద్ద సంఖ్యలో విద్యార్థులకు పరిష్కారాలు ఉచితంగా అందుబాటులో ఉండేలా విద్యా మంత్రిత్వ శాఖ, ఏఐసీటీఈ కలిసి కృషి చేస్తున్నాయి. నీట్ లో సభ్యత్వం కలిగి ఉన్న 58 సాంకేతిక విద్యా సంస్థలు 100 రకాల సేవలను అందిస్తున్నాయి. ఇవి ఉపాధి నైపుణ్యాలు, సామర్థ్యాల పెంపుదల మరియు విద్యాపరమైన వ్యత్యాసాలను తగ్గించడానికి సహాయపడతాయి.

కార్యక్రమంలో ఏఐసీటీఈ చైర్మన్ ప్రొ. అనిల్ సహస్రబుధే, ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ మూర్తి; ఏఐసీటీఈ వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎంపీ పూనియా, ఏఐసీటీఈ సభ్య కార్యదర్శి ప్రొఫెసర్ రాజీవ్ కుమార్, మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

వాతావరణ అవగాహన ప్రచారం - జాతీయ ఫోటోగ్రఫీ పోటీ

న్యూఢిల్లీ, జనవరి 4:గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓహెచ్ యుఎ) వాతావరణ మార్పు అవగాహన ప్రచారం , జాతీయ ఫోటోగ్రఫీ పోటీని నిర్వహిస్తోంది. గుజరాత్ లోని సూరత్ లో ఫిబ్రవరి 4 ,5 తేదీల్లో జరిగే 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్- స్మార్ట్ సిటీస్: స్మార్ట్ అర్బనైజేషన్' ఈవెంట్ కోసం జరిగే ముందస్తు కార్యకలాపాల్లో 2022 జనవరి 26 వరకు పాల్గొనే వారికి ఈ పోటీ లో ప్రవేశం ఉంటుంది. వాతావరణ మార్పుల ద్వారా ఎదురయ్యే సవాళ్ల పై చైతన్యవంతం చేయడం, పరిష్కారాలకు ఆలోచనలతో పాల్గొనేవారిని ప్రోత్సహించడం , నగరాల్లో వాతావరణ పరిరక్షణ చర్యను పెంపొందించడం ఈ ప్రచార కార్యక్రమానికి, పోటీకి కూడా ఇతివృత్తంగా ఉన్నాయి.

వాతావరణ అవగాహన ప్రచారం:

ఈ ప్రచారంలో మునిసిపల్ కమిషనర్లు , పట్టణ స్థానిక సంస్థల ప్రధాన అధిపతులు, స్మార్ట్ సిటీ సిఇఒలు పాల్గొని పట్టణ వాతావరణ మార్పు ,సుస్థిరతతో సంబంధం ఉన్న సవాళ్లు ,పరిష్కారాలకు యువ మనస్సులను సమలేఖనం చేయడానికి వారి నగరాల్లోని పాఠశాలలు ,కళాశాలలతో సహా విద్యా సంస్థలలో అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి నగరాల్లో ఈ క్రింది వాటిలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ కార్యకలాపాలను నిర్వహిస్తారు :

వాతావరణ మార్పు అవగాహన ప్రచారం: వాతావరణ మార్పు , స్థిరమైన చర్యలపై నగర అధికారులు విద్యా సంస్థలలో అవగాహన కల్పించనున్నారు.

వాతావరణ మార్పులపై సోషల్ మీడియా ప్రచారం: నగర అధికారులు సోషల్ మీడియా అవగాహన ప్రచారాన్ని నిర్వహిస్తారు. మేయర్లు/మునిసిపల్ కమిషనర్లు/స్మార్ట్ సిటీ సిఇఒలు వంటి నగర నాయకులు వాతావరణ చర్యల గురించి మాట్లాడతారు. ఇది వారి నగరంలో అమలు చేయవచ్చు. ప్లాంటేషన్ డ్రైవ్, నీటి వనరుల శుభ్రత, ఇ-వ్యర్థాల రీసైక్లింగ్, నివాస - వాణిజ్య భవనాలలో సౌర శక్తిని స్వీకరించడాన్ని ప్రోత్సహించడం, లేదా వాతావరణ అనుసరణ లేదా ఉపశమన చర్యలను ప్రోత్సహించే ఏదైనా ఇతర చొరవ వంటివి చర్చకు తీసుకుంటారు. తీసుకోబడతాయి.

భారతీయ నగరాలపై వాతావరణ మార్పుల ప్రభావాలపైన, వాతావరణ మార్పులను స్వీకరించడానికి/ తగ్గించడానికి వ్యక్తులు, కమ్యూనిటీలు లేదా నగర అధికారులు తీసుకున్న చర్యలపైన దృష్టి సారించే ఛాయాచిత్రాలను పోటీ లో పాల్గొనేవారు సమర్పించాలి. పోటీలో పాల్గొనేందుకు, ఫోటోగ్రాఫ్ లను రెండు కేటగిరీల్లో సమర్పించాలి.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ ను 75 సంవత్సరాల ప్రగతిశీల భారతదేశాన్ని, దాని ప్రజల సుసంపన్నమైన చరిత్రను, సంస్కృతి , విజయాలను ప్రజలు వేడుకగా జరుపుకోవడానికి , స్మరించుకోవడానికి భారత ప్రభుత్వం తీసుకున్న చొరవ. ఈ



మహోత్సవాన్ని భారతదేశాన్ని దాని పరిణామ ప్రయాణంలో ఇప్పటివరకు తీసుకురావడంలో కీలకపాత్ర పోషించడమే కాకుండా, ఆత్మనిర్భర్ భారత్ స్ఫూర్తితో భారతదేశాన్ని 2.0 తో క్రియాశీలం చేయాలనే ప్రధాని మోడీ దార్శనికతను సాకారం చేసే శక్తిని , సామర్థ్యాన్ని కలిగి ఉన్న భారతదేశ ప్రజలకు అంకితం చేశారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అనేది భారతదేశ సామాజిక-సాంస్కృతిక, రాజకీయ ఆర్థిక గుర్తింపు గురించిన ప్రగతిశీలమైన వాటన్నింటి స్వరూపం. "ఆజాదీ కా అమృత్ మహోత్సవ్" అధికారిక ప్రయాణం 12 మార్చి 2021న ప్రారంభమైంది, ఇది మన 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవానికి 75 వారాల కౌంట్‌డౌన్‌ను ప్రారంభించింది.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు - తప్పిన ముప్పు

చిత్తూరు, జనవరి 4:మాది రడ్డిపల్లి నుండి యాదమరి మీదుగా చిత్తూరుకు వెళ్ళవలసిన ఆర్టీసీ బస్సు ప్రమాదవశాత్తు అదుపు తప్పడంతో పొలాల్లోకి దసుకు వెళ్ళింది. మాది రెడ్డిపల్లి నుంచి బయలుదేరిన బస్సు పి. గొల్లపల్లి గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పొలంలోకి దిగబడింది. అదృష్టవశాత్తు ఈ సంఘటనలో ప్రయాణికులు ఎవరూ గాయపడలేదని స్థానికులు తెలిపారు. బస్సులో ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ఇతర వాహనాల్లో తరలించారు.

కీలక, వ్యూహాత్మక ఖనిజ అవసరాలలో స్వావలంబన సాధించేందుకు కృషి

న్యూఢిల్లీ, జనవరి 4:దేశ ఖనిజ భద్రత హామీకి, కీలకమైన, ఖనిజ రంగంలో స్వావలంబనను సాధించేందుకు గనుల మంత్రిత్వ శాఖ నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ (ఎన్ఎఎల్‌సిఒ), హిందుస్తాన్ కాపర్ లిమిటెడ్ (హెచ్‌సిఎల్), మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంఇసిఎల్) భాగస్వామ్యంతో ఖనిజ్ బిదేశ్ ఇండియా లిమిటెడ్ (కెఎబిఎల్) అన్న పేరుతో జాయింట్ వెంచర్ కంపెనీని సృష్టించింది.

లిథియం, కోబాల్ట్ తదితర కీలకమైన, వ్యూహాత్మక స్వభావం కలిగిన విదేశీ ఖనిజ ఆస్తులను గుర్తించడం, కొనుగోలు చేయడం కెఎబిఎల్ విధి. ఆత్మనిర్భర్ భారత్ మరింత పుంజుకునులే చేసే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమం కీలకమైన ఇ- మొబిలిటీ, పునరావృత ఇంధనం, వైద్యం, ఎయిరోస్పేస్, విమానయాన తదితర రంగాల అవసరాలను తీర్చనుంది.

నియమిత అధ్యయనం, ఎంపిక ప్రమాణాల ఆధారంగా, విదేశాలలో ఖనిజ ఆస్తుల సేకరణ అవకాశాలను అన్వేషించడానికి ఎంపిక చేసిన మూలదేశాలను షార్ట్ లిస్ట్ చేయడం జరిగింది.

ఇంతవరకు కెఎబిఎల్ కీలక, వ్యూహాత్మక ఖనిజాలు కలిగిన ఆస్ట్రేలియా, అర్జెంటీనా, బొలీవియా, చిలీ వంఇ మూల దేశాలతో సంప్రదింపులు జరుపుతోంది. భావి ఖనిజ విస్తీర్ణానికి సంబంధించి తగిన శ్రద్ధ, పెట్టుబడి నిర్ణయాలను తీసుకోవడానికి ప్రాథమికంగా ప్రభుత్వ యాజమాన్య సంస్థలతో

ఢిల్లీలో వీకెండ్ కర్ఫ్యూ

న్యూఢిల్లీ, జనవరి 4:దేశ రాజధాని ఢిల్లీలో కరోనా ఉధృతి కొనసాగుతోంది. రోజు రోజుకు కరోనా పాజిటీవ్ కేసుల సంఖ్య పెరిగిపోతున్నాయి. ఢిల్లీలో ఒమిక్రాన్ కేసుల సంఖ్య 362కు చేరింది. దీంతో ఒమిక్రాన్ కట్టడిపై ఢిల్లీ ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఈ క్రమంలో వీకెండ్ కర్ఫ్యూ పెట్టే దిశగా ఢిల్లీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఒమిక్రాన్ కట్టడిపై వర్చువల్ పద్ధతిలో సమావేశం అయిన ఢిల్లీ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ వీకెండ్ కర్ఫ్యూపై చర్చించారు.

కాగా, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ కరోనా బారిన పడిన సంగతి తెలిసిందే. సోమవారం ఢిల్లీలో 4,099 కొత్త కేసులు నమోదు కాగా.. ఒక మరణం సంభవించింది. కరోనా కట్టడికి ఇప్పటికే ఢిల్లీలో రెడ్ అలర్ట్ అంక్షలు అమలు చేస్తున్నారు. దుకాణాలు, మాల్స్, సెలూన్‌ల మూసివేశారు. ప్రజా రవాణా 50 శాతం ఆక్యూపెన్సీతో నడుపుతున్నారు. వివాహాలు, అంత్యక్రియలపై కూడా ఆంక్షలు కొనసాగుతున్నాయి. అయితే, కరోనా కేసులు గణనీయంగా పెరగడంతో వీకెండ్ కర్ఫ్యూ పెట్టాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.

మరోవైపు జనవరి 8 నాటికి ఢిల్లీలో రోజువారీ కేసుల సంఖ్య 9 వేల వరకు నమోదయ్యే అవకాశం ఉందని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖలోని ఉన్నత వర్గాలు తెలిపాయి. దేశంలో ఒమిక్రాన్, డెల్టా వేరియంట్‌లు కేసులు నమోదు అవుతున్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ అధికారులు తెలిపారు.

సంక్రాంతికి 6,970 ప్రత్యేక సర్వీసులు: ఏపీఎస్ ఆర్టీసీ

అమరావతి, జనవరి 4: సంక్రాంతి పండుగ సమీపిస్తున్న తరుణంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చేసేందుకు ఏపీఎస్ ఆర్టీసీ పలు చర్యలు తీసుకుంటోంది. ఏపీకి పలు ప్రాంతాల నుంచి తరలివచ్చే వారి కోసం భారీ సంఖ్యలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడిపేందుకు ఏర్పాట్లు చేసింది. ఈ సంక్రాంతి సీజన్‌లో ఏకంగా 6,970 ప్రత్యేక సర్వీసులు నడపనుంది.

వాటిలో పండగ ముందు 4,145 ప్రత్యేక సర్వీసులు, పండగ తరువాత 2,825 ప్రత్యేక సర్వీసులు నడిపేందుకు ప్రణాళికను ఆమోదించింది. గత ఏడాది కంటే 35 శాతం అధికంగా ఈ ఏడాది ప్రత్యేక బస్సులు నడపాలని ఏపీ ఆర్టీసీ నిర్ణయించింది.

సంక్షేమ పాఠశాలలకు అంబేద్కర్ పేరు

బెంగళూరు: రాష్ట్రంలోని సాంఘిక సంక్షేమశాఖకు అనుబంధంగా ఉండే అన్ని రెసిడెన్షియల్ స్కూళ్లకు భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు ఖరారు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. సాంఘిక సంక్షేమ శాఖకు అనుబంధంగా 1 నుంచి 5 తరగతుల విద్యార్థుల కోసం 66 రెసిడెన్షియల్ పాఠశాలలను తెరిచారు. వీటిలో 8500 మంది విద్యార్థులకు అవకాశం ఉంటుంది. సదరు రెసిడెన్షియల్ పాఠశాలలన్నీ అంబేద్కర్ పేరుతో కొనసాగుతాయి. అంబేద్కర్ పోరాటంతో పాటు దేశానికి ఆయన సాధనలను నేటి విద్యార్థులకు తెలిసేలా ఉండాలనే రెసిడెన్షియల్ పాఠశాలలకు ఆయన పేరు పెట్టినట్లు ప్రభుత్వం ప్రకటించింది. సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూళ్లకు అంబేద్కర్ పేరు పెట్టడం సంతోషకరమని దళిత సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

టీటీడీ బోర్డు సభ్యుల నియామకంపై హైకోర్టులో విచారణ

అమరావతి: టీటీడీ బోర్డు సభ్యుల నియామకంపై హైకోర్టులో విచారణ జరిగింది. నేర చరిత్ర గల 18 మందిని టీటీడీ బోర్డు సభ్యులుగా నియమించడాన్ని సవాల్ చేస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వివరణ ఇవ్వాలని 18 మందికి హైకోర్టు నోటీసులు ఇచ్చినా ఎవరూ కౌంటర్లు దాఖలు చేయలేదని పిటిషనర్ పేర్కొన్నారు. ముగ్గురు సభ్యులు నోటీసులు కూడా తీసుకోలేదని పిటిషనర్ పేర్కొన్నారు. నోటీసులు తీసుకోని బోర్డు సభ్యులు అల్లూరి మహేశ్వరి, ఎమ్మెల్యే రాంభూపాల్‌రెడ్డి ఎంఎన్ శశిధర్‌లపై పిల్ ఫైల్ అయినట్టు ప్రకటన ఇవ్వాలని పిటిషనర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తదుపరి విచారణ ఫిబ్రవరి 7కి కోర్టు వాయిదా వేసింది.

కనక దుర్గమ్మను దర్శించుకున్న ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి

విజయవాడ,జనవరి 4:: ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానానికి ప్రభుత్వ చీఫ్ విప్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పి చైర్మన్ ఆకేపాటి అమరనాథ రెడ్డి విచ్చేశారు. కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందించి దుశ్శాలువలతో సత్కరించి ఆశీర్వదించారు. అమ్మవారి దయతో నూతన ఏడాదిలో ప్రజలందరూ సుభిక్షంగా, ఆరోగ్యంగా ఉండాలని శ్రీకాంత్ రెడ్డి, అమర నాథ రెడ్డి ఆకాంక్షించారు.

బరేలీలో మారథాన్‌లో తోపులాట - గాయపడిన విద్యార్థులు

ఉత్తరప్రదేశ్, జనవరి 4: ఉత్తరప్రదేశ్ బరేలీలో కాంగ్రెస్ నిర్వహించిన మారథాన్ లో పెద్ద సంఖ్యలో స్కూల్ విద్యార్థులు, మహిళలు మారథాన్ లో పాల్గొన్నారు. ఒకరినొకరు తోసుకుంటూ పరిగెత్తడంతో పలువురు కిందపడిపోయారు. దాంతో పలువురు విద్యార్థులకు స్వల్ప గాయాలు అయ్యాయి. కాంగ్రెస్ నిర్వహించిన మహిళల మారథాన్ లో లడ్కీహూన్, లడ్ శక్తిహూన్ అంటే నేను అమ్మాయిని, నేను పోరాడగలననే స్లోగన్ తో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమానికి స్థానిక స్కూల్ విద్యార్థులను తీసుకువచ్చారు.మారథాన్‌లో పరుగెత్తే సమయంలో అమ్మాయిలు ఒకరిని మరొకరు తోసుకున్నారు. ఈ తోపులాటలో అంతా కింద పడిపోయారు. పాల్గొన్న వారిలో కొందరికి గాయాలయ్యాయి. కరోనా వైరస్ వ్యాప్తి సమయంలో చాలా మంది చిన్నారులకు మాస్కులు లేకుండా కనిపించారు.ఈ వీడియోలు సోషల్ మీడియాలోకి రావడంతో పెద్ద ఎత్తున రాజకీయ రచ్చకు కారణంగా మారుతోంది. చిన్న పిల్లలను ప్రచారంలో ఉపయోగించడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. మరోవైపు ఈ ఘటన రాజకీయ కుట్ర అంటూ కాంగ్రెస్ నేత, మాజీ మేయర్ సుప్రియా అరోన్ అసంబద్ధ ప్రకటన చేశారు. వైష్ణోదేవిలో తొక్కిసలాట జరిగినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదని ట్వీట్ చేశారు.

2021లో మౌలిక సదుపాయాల అభివృద్ధి, నెట్ వర్క్ సామర్థ్య విస్తరణలో మునుపెన్నడూ లేని వృద్ధిని నమోదు చేసిన కోల్‌కతా మెట్రో రైల్వే

న్యూఢిల్లీ, జనవరి 4:2021 లో, కోల్ కతా మెట్రో మౌలిక సదుపాయాల అభివృద్ధి , నెట్ వర్క్ సామర్థ్య విస్తరణలో మునుపెన్నడూ లేని వృద్ధిని చూసింది. కోవిడ్ సవాళ్లు ఉన్నప్పటికీ, కోల్ కతా మెట్రో భవిష్యత్ అభివృద్ధికి ప్రయాణికులకు తదుపరి స్థాయి ప్రయాణ అనుభవానికి పునాది వేయడం కొనసాగించింది.

2021 సంవత్సరంలో కోల్ కతా మెట్రో సాధించిన కొన్ని ముఖ్యమైన విజయాలు:

22.02.2021 న నోపారా నుండి దక్షిణేశ్వర్ (4.1 కి.మీ పొడవు) వరకు ఉత్తర-దక్షిణ మెట్రో పొడిగింపు భాగాన్ని గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ ప్రారంభించారు ఈ మార్గం లో మొదటి మెట్రోను జెండా ఊపి ప్రారంభించారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగంలో, '' ఈ పొడిగింపు కోల్ కతా ప్రజలకు మాత్రమే కాకుండా హుగ్లీ, హౌరా ,ఉత్తర 24 పరగణాలకు మెట్రో సేవల ప్రయోజనాన్ని పొందడానికి సహాయపడుతుంది'' అన్నారు.

నోపారా కార్నెడ్ నాన్ ఇంటర్ లాకింగ్ (ఎన్ ఐ) పని సంవత్సరంలో విజయవంతంగా పూర్తయింది. ఈ ఎన్ ఐ పనిలో నోపారా వద్ద ఎలక్ట్రానిక్ ఇంటర్ లాకింగ్ సిస్టమ్ మార్పు ఇమిడి ఉంది, ఇది కార్నెడ్ లోని అన్ని మార్గాలు, పాయింట్లు, సిగ్నల్స్ ,ట్రాక్ విభాగాలతో అనుసంధానించబడింది. ఈ మార్పు నోపారా నుంచి, నోపార వరకు రేక్ ల కదలిక నిర్వహణ సరళత్వాన్ని ఎంతగానో మెరుగుపరిచింది. తద్వారా మెట్రో రైల్వే నడుపుతున్న రైళ్ల పనితీరు

ప్రామాణికాలను కూడా పెంచింది.

ఫూల్ బగాన్ నుండి తూర్పు-పశ్చిమ మెట్రోకు చెందిన సీల్దా వరకు మొదటి

ట్రయల్ రన్ ఈ సంవత్సరం విజయవంతంగా జరిగింది. పూర్తయింది. ఈ కారిడార్ లో సీల్దా స్టేషన్ అతి త్వరలో ప్రారంభమవుతుంది.

27.08.2021 న 1.24 ఎమ్ డబ్ల్యుపి పైకప్పు సోలార్ పవర్ ప్లాంట్ ను దేశ సేవకు అంకితం చేశారు. ఈ పవర్ ప్లాంట్ ఈస్ట్-వెస్ట్ మెట్రో సెంట్రల్ పార్క్ డిపో రెండు ప్రధాన భవనాల పై కప్పులపై 19173 చదరపు మీటర్ల ప్రాంతంలో ఏర్పాటు అయింది. ఫలితంగా మెట్రో రైల్వే సంవత్సరానికి రూ.45 లక్షలు (సుమారు) ఆదా చేయగలదు.

గాంధీ జయంతి సందర్భంగా మహానాయక్ ఉత్తమ్ కుమార్ మెట్రో స్టేషన్ వద్ద రెండు ఎలివేటర్లను 02.10.2021 న దేశ సేవకు అంకితం చేశారు. ఈ రెండు లిఫ్ట్‌లు మెట్రో ప్రయాణికుల దీర్ఘకాలిక డిమాండ్ ను నెరవేర్చాయి. ఇంకా ఈ స్టేషన్ లో అదనపు ప్రయాణీకుల సౌకర్యాలను అందించాయి.

దేశం లోనే తొలిసారి మెట్రో రైల్వే 37 వ వ్యవస్థాపక దినోత్సవం అయిన 24.10.2021 న, మహానాయక్ ఉత్తమ్ కుమార్ స్టేషన్ లో నాన్-ఎసి మెట్రో రేక్ (కోల్ కతా మెట్రో యొక్క చివరి నాన్-ఎసి రేక్ అయిన రేక్ నం-ఎన్ 12/14) లోపల ఎగ్జిబిషన్ ఆన్ వీల్స్ ఏర్పాటైంది. ఈ ప్రదర్శనలో దేశపు మొదటి మెట్రో అయిన కోల్ కతా మెట్రో అద్భుతమైన గతం, ప్రస్తుత దృశ్యం , దాని భవిష్యత్తు ప్రాజెక్టులను రంగురంగుల పోస్టర్ల ద్వారా ప్రదర్శించారు. ఎగ్జిబిషన్ తరువాత, మెట్రో రైల్వే తన నాన్-ఎసి రేక్ లకు స్వస్తి పలికింది.

కోల్ కతా మెట్రో నాన్-ఎసి రేక్ లు గతంగా మెట్రో రైల్వే ఇప్పుడు ప్రయాణికులకు పూర్తి ఎసి సర్వీసులు అందిస్తోంది.

ప్రయాణికుల ప్రయోజనం కోసం 25.11.2021న మెట్రో రైల్వేలో టోకెన్లను తిరిగి ప్రవేశపెట్టారు. టోకెన్లు చివరిసారిగా 23.03.2020 న జారీ చేయబడ్డాయి. ఈ టోకెన్లను శానిటైజ్ చేయడానికి, అన్ని ఉత్తర-దక్షిణ , తూర్పు-పశ్చిమ మెట్రో స్టేషన్లలో 40 టోకెన్ శానిటైజర్ యంత్రాలను ఏర్పాటు చేశారు. అల్ట్రా వైలెట్ కిరణాల సహాయంతో ఈ యంత్రాలు ఉపయోగించిన టోకెన్లను నాలుగు నిమిషాలపాటు పరికల్పన చేస్తాయి.

తపన్ సిన్హా మెమోరియల్ ఆసుపత్రిలో 01.12.2021 న జనరల్ మేనేజర్ శ్రీ

మనోజ్ జోషి ప్రెజర్ స్వింగ్ అడ్సార్ప్షన్ (పిఎస్ఎ) ఆక్సిజన్ జనరేటర్ ప్లాంట్ ను ప్రారంభించారు.ఈ ప్లాంట్ రోగుల ప్రయోజనం కోసం నిమిషానికి 250 లీటర్ల ఆక్సిజన్ ను ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంది. బల్క్ ఆక్సిజన్ సిలిండర్ కొనుగోలు ఖర్చును కనీసం 70 శాతం తగ్గించడానికి కూడా ఇది సహాయపడుతుంది.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా, క్యూఆర్ కోడ్ ఆధారిత టికెటింగ్ సిస్టమ్ ను 04.12.2021 నుంచి తూర్పు-పశ్చిమ మెట్రోలో ప్రవేశపెట్టారు. ఈ మూడవ ప్రత్యామ్నాయ వ్యవస్థను ప్రవేశపెట్టడంతో, ప్రయాణికుల దీర్ఘకాల డిమాండ్ నేర వెరింది. మెట్రో టిక్కెట్లు ఇప్పుడు ప్రయాణికుల చేతి వేళ్ళ కు అందుబాటులో ఉన్నాయి. క్యూఆర్ కోడ్ స్కానర్లను అందించిన తరువాత, ఉత్తర-దక్షిణ కారిడార్ స్టేషన్లలో ఇప్పటికే ఉన్న ఎఎఫ్ సి గేట్ల హార్డ్ వేర్ ను అప్ గ్రేడ్ చేసిన తరువాత మెట్రో రైల్వే కూడా ఇప్పుడు ఉత్తర-దక్షిణ కారిడార్ లో ఈ సదుపాయాన్ని కొన్ని నెలల్లో విస్తరించడానికి కృషి చేస్తోంది.

మెట్రో రైల్వేకు చెందిన తపన్ సిన్హా మెమోరియల్ హాస్పిటల్ గత ఏడాది నుంచి కోవిడ్ రోగులకు చికిత్స చేస్తోంది. ఇక్కడ కోవిడ్ రోగుల చికిత్స కోసం 75 పడకల ప్రత్యేక కోవిడ్ వార్డు ఏర్పాటయింది. 30.12.2021 వరకు 604 మంది కోవిడ్ రోగులకు ఈ వార్డు లో చికిత్స చేశారు. అన్ని ఆధునిక చికిత్సా సదుపాయాలు ఈ వార్డులో ఉన్నాయి. కోవిడ్ వ్యాక్సినేషన్ డ్రైవ్ 02.02.2021 నుంచి మెట్రో రైల్వేలో ప్రారంభమైంది. 30.12.2021 వరకు మొత్తం 21,423 మోతాదుల్లో కోవిడ్ వ్యాక్సిన్ (1వ మరియు 2వ మోతాదు) ఆరోగ్య సంరక్షణ కార్మికులు, మెట్రో సిబ్బంది, రైల్వే లబ్ధిదారులు, ఒప్పంద సిబ్బంది ఇంకా సాధారణ ప్రజలకు ఇచ్చారు.

ప్రైవేట్ విశ్వవిద్యాలయాలు, బ్యాంకులు, ఆరోగ్య సంరక్షణ సంస్థలు, బీమా కంపెనీలు మొదలైన వాటితో సహా కార్పొరేట్ సంస్థలకు స్టేషన్ బ్రాండింగ్ హక్కుల కోసం మెట్రో రైల్వే 7 మెట్రో స్టేషన్లను అందించింది. ఉత్తర-దక్షిణ మెట్రో లో 5 స్టేషన్లు - డమ్డమ్, నోపారా, బెల్గాచియా, ఎస్ప్లనేడ్ పార్క్ స్ట్రీట్ , తూర్పు-పశ్చిమ మెట్రో లో 2 స్టేషన్లు - బెంగాల్ కెమికల్ ఉ సీల్దా (ఇది అతి త్వరలో పనిచేస్తుంది) ఈ టెండర్ లో స్టేషన్ బ్రాండింగ్ హక్కుల కోసం అందించబడ్డాయి.

ఈ స్టేషన్ల స్టేషన్ బ్రాండింగ్ హక్కులను అందించడం ద్వారా మెట్రో మొదటి సంవత్సరంలో రూ.3.65 కోట్లు సంపాదించింది. మెట్రో స్మార్ట్ కార్డులు కూడా రెండు ప్రైవేట్ సంస్థలతో బ్రాండ్ చేయబడ్డాయి. దీని ద్వారా మెట్రో ఇప్పటివరకు రూ.20.65 లక్షలు సంపాదించింది. ఇప్పటివరకు 11 మెట్రో స్టేషన్లకు సహ బ్రాండెడ్ గా ఉంది.

నార్త్-సౌత్ కారిడార్ లో ఎఎఫ్ సి-పిసి గేట్ల బ్రాండింగ్ కూడా విజయవంతంగా 2 సంవత్సరాల కాలానికి పూర్తయింది.

స్టేషన్ల 350 గేట్ల బ్రాండింగ్ హక్కులను అందించడం ద్వారా మొత్తం రూ.73.50 లక్షలు సంపాదించారు.

ఇది కాకుండా, మొత్తం 26 ఉత్తర- దక్షిణ మెట్రో స్టేషన్లలో 52 కార్డ్ బ్యాలెన్స్ చెకింగ్ టెర్మినల్స్ (సిబిసిటి) కూడా బ్రాండ్ చేయబడ్డాయి, ఇది మెట్రో రైల్వే రూ.12.48 లక్షలు సంపాదించడానికి సహాయపడింది.

ఒక ప్రైవేట్ సంస్థ తో ఒప్పందం ప్రకారం, నోపారా నుండి కవి సుభాష్ వరకు 24 మెట్రో స్టేషన్లలో పవర్ బ్యాంక్ రెంటల్ టవర్లను ఏర్పాటు చేశారు. ఏడాది కాలం లో మెట్రో 12 లక్షల రూపాయల ఆదాయం సంపాదించగలిగింది.

బండి సంజయ్‌కు బీజేపీ నేతల పరామర్శ

కరీంనగర్ జనవరి 4 (నేటినిజం ప్రతినిధి): తెలంగాణ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ కరీంనగర్ జిల్లా జైల్లో రిమాండ్ లో ఉన్న సంగతి తెలిసిందే. ఆయనను కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, మాజీ ఎంపీ వివేక్ పరామర్శించారు. జైల్లో ములాఖత్ సమయంలో సంజయ్ ను కలిసేందుకు వీరు ముగ్గురుకి అనుమతినిచ్చారు. దీంతో ములాఖత్ సమయంలో సంజయ్ ను వీరు కలిశారు. అనంతరం కరీంనగర్ లోని సంజయ్ కార్యాలయాన్ని వీరు పరిశీలి ంచారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మీడి డియాతో మాట్లాడుతూ.. బీజేపీ కార్యాల యంపై ఏ ప్రాతిపదికన పోలీసులు దాడి చేశారని ప్రశ్నించారు. ధర్నాచౌక్ వద్ద సీఎం కేసీఆర్, ఆయన కుటుంబం, వారి ఎంపీలు, ఎమ్మెల్యేలు ధర్నా చేయవచ్చు కానీ? ఇతర పార్టీల నేతలు చేయకూడదా అని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమ సమయం లో కూడా ఇంతటి అణచివేత లేదని అన్నారు. ఉద్యమ సమయంలో సకల జనుల సమ్మె, రోడ్డు రోకోలు, రైల్ రోకోలు ఇలా ఎన్నో చేశామని? ఇప్పుడు సొంత రాష్ట్రం లోనే అణచివేత జరుగుతోందని విమర్శించారు. ఢిల్లీలో ఏడాది పాటు రైతులు ఆందోళన చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం అడ్డుకోలేదని అన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం పెట్టే తప్పుడు కేసులకు బీజేపీ భయపడదని చెప్పారు. టీఆర్ఎస్ కు లేని కరోనా నిబంధనలు బీజేపీకి మాత్రమే వర్తిస్తాయా? అని ప్రశ్నించారు.

ముగిసిన సీఎం వైఎస్ జగన్ ఢిల్లీ పర్యటన

న్యూఢిల్లీ, జనవరి 4:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీ పర్యటన ముగిసింది. మంగళవారం పలువురు కేంద్రమంత్రులతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర రవాణా మంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం జగన్.. విశాఖ నుంచి భోగాపురం వరకు జాతీయ రహదారి ఏర్పాటుపై చర్చించారు. అలాగే కేంద్ర మంత్రులు అనురాగ్ ఠాకూర్, ధర్మేంద్ర ప్రధాన్‌ను సీఎం కలిశారు.

కేంద్ర సమాచార, క్రీడాశాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తో సీఎం జగన్ భేటీ అరగంట పాటు కొనసాగింది. సమావేశంలో ఏపీలో క్రీడా మైదానాల అభివృద్ధి సహా పలు అంశాలపై చర్చించారు.

కేంద్రమంత్రి గడ్కరీతో సీఎం వైఎస్ జగన్ సమావేశం సుమారు గంటపాటు సాగింది. రాష్ట్రంలో పలు జాతీయ రహదారులను మంజూరు చేసినందుకు సీఎం జగన్ ధన్యవాదాలు తెలిపారు. విశాఖపట్నం పోర్టు నుంచి రిషికొండ, భీమిలి మీదుగా భోగాపురం వరకూ జాతీయ రహదారి డీపీఆర్ తయారీ అంశంపై చర్చించారు. విశాఖపట్నానికి ఈ రహదారి చాలా ఉపయోగమని, విశాఖపట్నం పోర్టు నుంచి ఒడిశా, ఛత్తీస్‌గఢ్ వెళ్లే సరుకు రవాణా వాహనాలకు తక్కువ దూరం అవుతుందని సీఎం జగన్.. కేంద్ర మంత్రికి తెలిపారు.

సముద్ర తీరాన్ని ఆనుకుని బీచ్‌కారిడర్ ప్రాజెక్టులకు సమీపం నుంచి ఈ రోడ్డు వెళుతుందని సీఎం జగన్ కేంద్ర మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని చేరుకునేందుకు, ఈ ప్రాంతంలో పర్యాటకరంగం అభివృద్ధికి ఈ రోడ్డు నిర్మాణం అత్యంత దోహపడుతుందని కేంద్రమంత్రికి వివరించారు. విశాఖ నగరంలో వాహన రద్దీని దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 6 లేన్ల రహదారిని మంజూరు చేయాలని సీఎం జగన్ కోరారు.

బంగారం కొనే వారికి భారీ శుభవార్త..!

హైదరాబాద్, జనవరి 4: ఈ కొత్త ఏడాదిలో మీరు బంగారం కొనాలని చూస్తున్నారా? అయితే, మీకు ఒక శుభవార్త. నేడు(జనవరి 4) బంగారం ధరలు భారీగా తగ్గాయి. సుమారు తులం బంగారం మీద రూ.300కు పైగా తగ్గింది. గత కొన్ని రోజులుగా పెరుగుతూ వస్తున్న బంగారం ధరల్లో ఈ రోజు భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. న్యూఢిల్లీ బులియన్ ఇండియన్ జ్యూవెలరీ మార్కెట్లో 10 గ్రాముల స్వచ్ఛమైన బంగారం ధర రూ.47,963గా ఉంది. నిన్నటితో పోలిస్తే నేడు పసిడి ధర సుమారు రూ.300కు పైగా తగ్గింది. అలాగే, ఆభరణాల తయారీలో వాడే 10 గ్రాముల బంగారం ధర నేడు రూ.43,934గా ఉంది.

ఇక హైదరాబాద్ గోల్డ్ మార్కెట్లో బంగారం ధరలు భారీగా తగ్గాయి. స్వచ్ఛమైన 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.370 పైగా తగ్గి రూ.48,990కు చేరుకుంటే.. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల 10 గ్రాముల పుత్తడి ధర రూ.44,900కు చేరుకుంది. విజయవాడ మార్కెట్లో కూడా ఇవే ధరలు ఉన్నాయి. బంగారం ధరతో పాటు వెండి ధరలు కూడా భారీగా తగ్గాయి. నేడు కేజీ వెండి ధర రూ.500కి పైగా తగ్గి రూ.61,462కు చేరుకుంది. బంగారం, వెండి ధరలు అనేవి ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ మార్కెట్ పసిడి ధరల్లో మార్పు, కేంద్ర బ్యాంకుల వద్ద ఉన్న బంగారం నిల్వలు, వాటి వడ్డీ రేట్లు, జువెలరీ మార్కెట్, భౌగోళిక ఉద్రిక్తతలు, బాండ్ ఈల్డ్ వంటి పలు అంశాలు చేత ప్రభావం చెందుతాయి.

క్యాంప్ కార్యాలయంలో సంబరాలు

రంగారెడ్డి, జనవరి 4:ఘట్కేసర్ క్యాంప్ కార్యాలయంలో రైతుబంధు సంబురాలు మిన్నంటాయి. వారం రోజుల పాటు రైతుబంధు సంబురాలు జరుపుకోవాలని మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు మేడ్చల్ నియోజక వర్గంలో ఘనంగా జరుపుకున్నారు. రాష్ట్ర మంత్రి మల్లారెడ్డి, జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, నాయకులు, తదితరులు, రైతు బంధు సంబురాల్లో పాల్గొన్నారు.

శ్రీహరికోటలో కరోనా కలకలం..14 మందికి కరోనా

నెల్లూరు, జనవరి 4:: నెల్లూరు జిల్లా శ్రీహరికోటలో కరోనా కలకలం రేగింది. శ్రీహరికోట సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రంలో ఇద్దరు వైద్యులకు, 12 మంది ఉద్యోగులకు కరోనా సోకింది. కరోనా సోకిన వారి శాంపిల్స్‌ను జీనోమ్ సీక్వెన్సింగ్ ల్యాబ్‌కు పంపించారు. మొత్తం 14 మందికి కరోనా సోకడంతో అంతరిక్షకేంద్రంలో పనిచేస్తున్న మిగతా ఉద్యోగులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీనికోసం ప్రత్యేక మార్గదర్శకాలను షార్ అధికారులు విడుదల చేశారు. బయో మెట్రిక్ స్థానంలో అటెండెన్స్ రిజిస్టర్లను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, వైద్యులకు కరోనా సోకడంతో ఈనెల చివరి వారంలో నిర్వహించాల్సిన రీ శాట్ ఉపగ్రహ ప్రయోగం వాయిదా పడే అవకాశముంది. ఒక్కరోజే ఇంత మందికి పాజిటివ్ కేసులు నమోదు కావడం వల్ల అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులంతా కలవరపాటుకు గురయ్యారు.

తెలంగాణలో సీరో సర్వే

హైదరాబాద్, జనవరి 4: తెలంగాణలో కరోనా కేసులు మళ్లీ పెరుగుతున్న వేళ మరోసారి సీరో సర్వే చేయనున్నారు. ఐసీఎంఆర్, ఎన్ఐఎన్, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించనున్నారు. రక్తంలో యాంటీబాడీల అభివృద్ధిపై అధ్యయనం కోసం నేటి నుంచి ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు.

ప్రతి జిల్లాలోని 10 గ్రామాల చొప్పున ఎంపిక చేసి సర్వే చేస్తారు. మొత్తం 33 జిల్లాల్లో ఉన్న 330 గ్రామాల్లో ఇంటింటికి సర్వే నిర్వహించనున్నారు. 16వేల మంది నమూనాలతో అధ్యయనం చేస్తారు. వైరస్‌ని ఎదుర్కొనేందుకు జనంలో ఎంత మేరకు నిరోధకత పెరిగిందనే అంశం ఈ సర్వేలో తెలుస్తుంది.

ఇంటర్ విద్యార్థిని అదృశ్యం

మంగళగిరి, జనవరి 4:: నగరంలోని పాత మంగళగిరికి చెందిన ఓ ఇంటర్ విద్యార్థిని అదృశ్యమైంది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు? పాత మంగళగిరికి చెందిన షేక్ జాని- నాగుల్ మీరా దంపతుల కుమార్తె షేక్ ఆఫ్రిన్ (17) వీజే కళాశాలలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో ఈనెల 3వ తేదీన ఉదయం కళాశాలకు వెళ్లిన ఆఫ్రిన్ తిరిగి ఇంటికి రాలేదు. ఆమె స్నేహితులను, బంధువులను విచారించినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి నాగుల్ మీరా మంగళవారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు భరోసా కేంద్రంను పరిశీలించిన కలెక్టర్

అమరావతి, జనవరి 4:కృష్ణాజిల్లా బంటుమిల్లి మండల పరిధిలోని ముంజులూరు గ్రామ రైతు భరోసా కేంద్రంను జిల్లా కలెక్టర్ జె నివాస్ ఆకస్మిక పరిశీలించారు. రైతుల అమ్మిన ధాన్యంకు సంబంధించి కూలీల హమాలీల చెల్లింపు, రవాణాల చార్జీల చెల్లింపు రైతులకు అందుతున్నాయా? లేదా? అనే విషయాలపై ఆరా తీసారు. జిల్లా కలెక్టర్ నివాస్ తోపాటు ఆర్డిఓ ఖాజావలి, బంటుమిల్లి తాసిల్దారు గోపాలకృష్ణ, తదితరులు ఉన్నారు.

కట్టెల కోసమని అడవిలోకి వెళ్లగా..యువతిపై అత్యాచారం, హత్య..

ఒరిస్సా, జనవరి 4:: బొరిగుమ్మ సమితి చలాసగుడ గ్రామ సమీపంలోని నీలగిరి అడవిలో 19 ఏళ్ల యువతి మృతదేహాన్ని పోలీసులు సోమవారం కనుగొన్నారు. ఆమెపై అత్యాచారం జరిపి, ఆపై హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. మృతురాలు చిలిగుడ గ్రామానికి చెందిన సుభద్ర అమనాత్య(19)గా గుర్తించినట్లు బొరిగుమ్మ సబ్‌డివిజనల్ పోలీసు అధికారి హరికృష్ణ మఝి తెలిపారు. సుభద్ర అమనాత్య డిసెంబరు 30న ఇల్లు విడిచి వెళ్లిపోయింది. ఆమె తిరిగి రాక

సిద్ధంగా ఉన్నాం.. జాగ్రత్తగా ఉందాం!

హైదరాబాద్, జనవరి 4:కరోనా కొత్త వేరియంట్ ఒమిక్రాన్ విషయమై ప్రజలు భయాందోళనలు చెందాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు చెప్పారు. అదే సమయంలో అజాగ్రత్త కూడా పనికిరాదని చెప్పారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ స్వీయ నియంత్రణ చర్యలు పాటించాలన్నారు. పని ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉంటూ మాస్క్ ధరించాలని, ప్రభుత్వం జారీ చేసే కోవిడ్ నిబంధనలను పాటించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

ప్రభుత్వం అన్ని రకాల ఏర్పాట్లతో కరోనాను ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉందని స్పష్టం చేశారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో సీఎం సోమవారం ప్రగతిభవన్‌లో వైద్యారోగ్య శాఖపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు.

మంత్రులు టి.హరీశ్‌రావు, వేముల ప్రశాంత్ రెడ్డి, ఇంద్రకరణ్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, వైద్యశాఖ కార్యదర్శి ఎస్ఏఎం రిజ్వీ, అధికారులు శ్రీనివాసరావు, రమేశ్ రెడ్డి, గంగాధర్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

'రాష్ట్రంలో కరోనా ప్రబలే ప్రమాదం ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా చేరకుండా చూడాలి. బహిరంగ సభలు, ర్యాలీలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రస్తుతం రాష్ట్రంలో లాక్‌డౌన్ విధించే పరిస్థితులు లేవు. అవసరం కూడా లేదు' అని వైద్యారోగ్య శాఖ అధికారులు ముఖ్యమంత్రికి నివేదించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడారు.

ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యం, ఐసొలేషన్, టెస్టింగ్ కిట్లు పెంచండి

'రాష్ట్రంలోని ప్రభుత్వ దవాఖానాల్లో అన్ని రకాల మౌలిక వసతులను పటిష్ట పరచాలి. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ దవాఖానాల్లో ఉన్న 99 శాతం బెడ్లను ఇప్పటికే ఆక్సిజన్ బెడ్లుగా మార్చారు. మిగిలిన మరో శాతాన్ని కూడా తక్షణమే ఆక్సిజన్ బెడ్లుగా మార్చాలి. అలాగే ఆక్సిజన్ ఉత్పత్తి సామర్థ్యాన్ని 140 మెట్రిక్ టన్నుల నుంచి 324 మెట్రిక్ టన్నులకు పెంచుకోగలిగాం. దీనిని 500 మెట్రిక్ టన్నులకు పెంచాలి. హోం ఐసోలేషన్ కిట్ల లభ్యతను 20 లక్షల నుంచి ఒక కోటికి,

టెస్టింగ్ కిట్ల సంఖ్యను సైతం 35 లక్షల నుంచి రెండు కోట్లకు పెంచాలి. అన్ని దవాఖానాల్లో వైద్యులు తక్షణం అందుబాటులో ఉండేలా చూడాలి. ఖాళీలను సత్వరమే భర్తీ చేయాలి.

ఏ కారణం చేతనైనా ఖాళీలు ఏర్పడితే 15 రోజుల్లో భర్తీ చేసుకునే విధంగా విధివిధానాలను రూపొందించాలి. జనాభా ప్రాతిపదికన రాష్ట్రంలో వైద్యులు, బెడ్లు, మౌలిక వసతులను పెంచుకొని వైద్యసేవలను మెరుగుపరచాలి..' అని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు.

నూతనంగా నిర్మించిన సమీకృత కలెక్టర్ కార్యాలయాల్లోకి పలు శాఖల కార్యాలయాలు మారుతున్న దృష్ట్యా ఖాళీ అయిన పాత కలెక్టరేట్ కార్యాలయాలు, ఆయా శాఖల భవనాలను, స్థలాలను విద్యా, వైద్య శాఖల అవసరాలకు ప్రత్యేకించి కేటాయించాలని ఆదేశించారు. పది వేల మంది కిడ్నీ రోగులకు డయాలిసిస్ సేవలు అందుతున్న నేపథ్యంలో డయాలిసిస్ మిషన్లను మరిన్ని పెంచి సేవలను విస్తృతం చేయాలని సూచించారు.

అన్నిచోట్లా బస్తీ దవాఖానాలు

'హైదరాబాద్ తరహాలో బస్తీ దవాఖానాలను నగరపాలికలకు విస్తరించాలి. జీహెచ్ఎంసీ పరిధిలో కూడా వీటి సంఖ్యను పెంచాలి. హెచ్ఎండీఏ పరిధిలోని కంటోన్మెంట్ జోన్ పరిధిలో ప్రజలకు సరైన వైద్య సేవలు మెరుగుపరిచేందుకు వార్డుకొకటి చొప్పున 6 బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి. రసూల్‌పురలో 2, ఎల్బీనగర్, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్, మల్కాజిగిరి, జల్‌పల్లి, మీర్‌పేట, పీర్జాదిగూడ, బోడుప్పల్, జవహర్ నగర్, నిజాంపేటలో ఒకటి చొప్పున బస్తీ దవాఖానాలను ఏర్పాటు చేయాలి.

వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 4, నిజామాబాద్‌లో 3, మహబూబ్ నగర్, నల్లగొండ, రామగుండం, ఖమ్మం, కరీంనగర్‌లో రెండు చొప్పున, జగిత్యాల, సూర్యాపేట, సిద్దిపేట, మిర్యాలగూడ, కొత్తగూడెం, పాల్వంచ, నిర్మల్, మంచిర్యాల, తాండూరు, వికారాబాద్, బోధన్, ఆర్మూర్, కామారెడ్డి, సంగారెడ్డి, జహీరాబాద్, గద్వాల్, వనపర్తి, సిరిసిల్ల, తెల్లాపూర్, బొల్లారం, అమీన్ పూర్, గజ్వేల్, మెదక్ పురపాలికల్లో ఒకటి చొప్పున ఏర్పాటు చేయాలి..' అని కేసీఆర్ ఆదేశించారు.

అర్హులకు వంద శాతం పథకాలను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం

అమరావతి, జనవరి 4:ప్రజల సమస్యలు తెలుసుకోవడానికే తాము పల్లెబాట కార్యక్రమాన్ని చేపట్టామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఎన్నికలు లేకపోయినా? ప్రజలకు సంక్షేమ పథకాలన్నీ అందుతున్నాయా? లేదా? అని తెలుసుకుంటున్నామని చెప్పారు. అర్హులైన అందరికీ వంద శాతం పథకాలను అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. అందుకే క్షేత్రస్థాయిలో పర్యటనలు చేస్తున్నామని చెప్పారు.

ప్రజలకు ఏ అవసరం వచ్చినా ఆదుకునేందుకు సచివాలయ వ్యవస్థ అందుబాటులో ఉందని పెద్దిరెడ్డి అన్నారు. ఏ ముఖ్యమంత్రి కూడా చేయలేని విధంగా సీఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని తెలిపారు. ప్రతి ఇంటికి స్వచ్ఛమైన నీటిని అందించడానికి గ్రామాలలో వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఎవరికి ఏ సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు ఎంతో చేస్తున్న జగన్ కు అందరూ మద్దతుగా నిలవాలని చెప్పారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల..

వరంగల్, జనవరి 4:రాష్ట్రంలో వైద్య దంత ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం అయింది. ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాలకు గాను ఆన్ లైన్ దరఖాస్తుల నమోదుకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నేడు నోటిఫికేషన్లు విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలల్లో కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేయనున్నారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష నీట్ 2021లో అర్హత సాధించిన అభ్యర్థులు నమోదు చేసుకోవాలని తెలిపారు. జనవరి 5వ తేదీ ఉదయం 8 గంటల నుండి 11వ తేదీ సాయింత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఆన్ లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వారు సూచించారు.

నిర్ధేశిత ధరఖాస్తు పూర్తి చేయడంతో పాటు అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంద. ఆన్‌లైన్ లో సమర్పించిన దరఖాస్తులు, సర్టిఫికెట్లను యూనివర్సిటీ పరిశీలించిన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. మెరిట్ జాబితా విడుదల అనంతరం వెబ్ ఆప్షన్లకు యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేస్తుంది. తదనుగుణంగా అభ్యర్థులు ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రవేశాలకు సంబంధించి అర్హత ఇతర సమాచారానికి యూనివర్సిటీ వెబ్ సైట్ లిలిలి.ఎనితీబీష్టబ. బివశ్రీజీనిణజీని జీ.ణనీల.తిని లో సందర్శించాలని యూనివర్సిటీ వర్గాలు ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసుపత్రిలో బ్రెజిల్ అధ్యక్షుడు - వైద్యం చేయొద్దంటోన్న ప్రజలు

న్యూఢిల్లీ, జనవరి 4:ప్రపంచదేశాలని కుదిపేస్తోంది కరోనా, ఒమిక్రాన్ వేరియంట్. పలువురు సెలబ్రిటీలు కరోనా బారిన పడుతున్నారు. కాగా బ్రెజిల్ అధ్యక్షుడు బొల్సోనారో తీవ్ర అనారోగ్యానికి గురి అయ్యారు. ఆయన వయసు 66సంవత్సరాలు. దాంతో ఆయన హాస్పటల్ లో చేరారు. ఈ విషయాన్ని స్వయంగా ఆయనే ట్విట్టర్ ద్వారా తెలియజేశారు. కాగా ఆయన పేగుకు శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్స్ తెలిపారు. ప్రజలు మాత్రం అధ్యక్షడికి వైద్యం చేయవద్దని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. బొల్సోనారో అనుచిత నిర్ణయాల వలన ప్రజలు చాలా ఇబ్బందులు పడాల్సి వచ్చిందని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కరోనా సెకండ్ వేవ్ సమయంలో బ్రెజిల్ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంది. ప్రజలు మాస్క్ పెట్టుకోనవసరం లేదని స్వయంగా ఆ దేశాధ్యక్షుడు బొల్సోనారో చెప్పడంతో మాస్క్ పెట్టుకోకుండా తిరిగారు అక్కడి జనం. దీంతో ఆ దేశంలో కరోనా విలయతాండవం చేసింది. ఆ సమయంలో లక్షలాది మంది కరోనా బారిన పడ్డారు. వేలాది మంది చనిపోయారు. చేతులు కాలాక అకులు పట్టుకున్న చందాన, కరోనా మహమ్మారి విజృంభణ తరువాత మాస్క్ తప్పనిసరి చేశారు. అప్పటికే జరగాల్సిన ఘోరం జరిగిపోయింది. అప్పటి నుంచి అధ్యక్షుడు బొల్సోనారోపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు.

జిల్లా అదనపు ఎస్పీగా భాద్యతలు స్వీకరించిన డి.చంద్రయ్య

రాజన్న సిరిసిల్ల, జనవరి 4(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా అదనపు ఎస్పీ గా చంద్రయ్య మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం లో బాధ్యతలుస్వీకరించారు.అనంతరం జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే ని మర్యాదపూర్వకంగా కలసి పుష్పా గుచ్చాలు అందజేశారు.జిల్లా లో ఉన్న అధికారులు అదనపు ఎస్పీ ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చలనుఅందజేశారు.అనంతరం జిల్లా యొక్క స్థితిగతులను గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం చేసి ఆదుకుందాం

రాజన్న సిరిసిల్ల, జనవరి 4(నేటినిజం ప్రతినిధి):ఉన్న ఊరువదిలి కడుపు చేతబట్టుకొని కూలీ పనికి గల్ఫ్ బాటపట్టిన నీరటి రమేష్, అనుపురానికి చెందినవాడు. ఇతడు దుబాయిలో కూలిపని చేసుకుంటుండగా 4వ.అంతస్తునుండి కింద పడగా అతడు తీవ్రగాయా గాయాలతో అక్కడ ప్రథమ చికిత్స చేయించుకొని సొంత గ్రామమైన అనుపురం చేరాడు. కానీ గత తొమ్మిది నెలల నుండి అతడు మంచం నుండి లేవలేని పరిస్థితుల్లో ఉన్నారు. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబం.ఇతనికి ఇద్దరు ఆడపిల్లలు. ఒక అమ్మాయి మధులత (8) సంవత్సరములు, మరొక అమ్మాయి చందన 12 సంవత్సరములు× వీరి ఆర్థిక పరిస్థితి బాగా లేక ఆర్థిక సహాయం కోసంఎదురుచూస్తున్నారు.ఇద్దరూ ఆడపిల్లకు వివాహానికి ఉపయోగాపడేలా× మన మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ సభ్యుల ద్వారా ఆర్థికసహాయం అందిద్దాం.దాతలు ముందుకు వచ్చి తమవంతు విరాళాలు అందిస్తే, వారి చేతి ఖర్చులకు కొంత ఇచ్చి , ఆమ్మాయిల పేరా ఫిక్స్‌డ్ చేయించి వారికి సర్టిఫికెట్ అందిద్దాం.దాతలు తమకు తోచిన విరాళాలు పంపిస్తే, ట్రస్టు ద్వారా కొంత కలిపి వారికి అందిద్దాం. విరాళాలు అందించే దాతలు ఈ క్రింద తెలిపిన నంబర్లకు పంపిస్తే వారికి అందిద్దాం. గూగుల్ పే: 9246939388, ఫోన్ పే: 9246938388.

జాతీయ స్థాయి క్రీడకారునికి ఆర్థిక సహాయం చేసిన మూడపల్లి సర్పంచ్ అంజిబాబు

రాజన్న సిరిసిల్ల, జనవరి 4(నేటినిజం ప్రతినిధి): వేములవాడ రూరల్ మండలంలో ని నూకలమర్రి గ్రామానికి చెందిన అచ్యుత్ ఈ నెల3 నుండి 8వరకు కేరళ రాష్ట్రములోని కొట్టాయామ్ జిల్లా లోజర్గు సౌత్ జోన్ నేషనల్ ఫుట్బాల్ క్రీడల్లో పాల్గొంటాడని జిల్లా యువజన సంఘాల అధ్యక్షుడు సోమినేని బాలు తెలిపారు

ఈ పేద క్రీడాకారు నికి పోటీలకు వెళ్లేందుకు ముందుకు వచ్చి వారి ఆర్థిక సహాయం అందించి దాతృత్వాన్ని చాటుచున్నారు .మంగళవారం అచ్యుత్ కు చందుర్తి మండలం మూడపల్లి గ్రామ సర్పంచ్ చిలుక అంజిబాబు వెంటనే విషయం తెలుసుకొని రూ . 500 0 వేలు ఫోన్ పే ద్వారా అచ్యుత్ కూపంపించినందుకువారికి సోమినేని బాలు ధన్యవాదాలు తెలిపారు గతంలో ముందుగా క్రీడకారునికి టీఆర్ఎస్ సీనియర్ నాయకులు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఏనుగు మనోహర్ రెడ్డి రూ 5000 వేలు, ఎరెడ్డి బాపురెడ్డి రూ . 5000 వేలు వేములవాడ రూరల్ మండలం అధ్యక్షుడు గోస్కుల రవి రూ 2000 వేలు , పులి సంపత్ గౌడ్ రూ . 2000 వేలు,నూకలమర్రి సర్పంచ్ పెండ్యాల తిరుపతి రూ. 1000 వేలుఅందజేశారు .నిరుపేద క్రీడాకారునికి ఆర్థిక సహాయం చేసిన దాతలకు క్రీడా సంఘాలు ,క్రీడాకారుల కృతజ్ఞతలు తెలిపారు

నూతన జాతీయ విద్యావిధానం, మహాత్ముని 'నయా తాలీమ్'ను ప్రతిబింబిస్తోంది: ఉపరాష్ట్రపతి

- స్వరాజ్య సాధనకు మాతృభాషను గాంధీ అనుసంధానం చేశారు- మన భాషా వైవిధ్యతే మన బలం, ఇదే మన సాంస్కృతిక వైవిధ్యతకు ప్రతిరూపం

- భాషా ఐకమత్యాన్ని పెంచేందుకు మరింత కృషి జరగాల్సిన అవసరముందన్న ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు

- మహారాష్ట్రలోని వర్ధాలో ఉన్న మహాత్మాగాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయం రజతోత్సవ వేడుకల్లో అంతర్జాల వేదిక ద్వారా పాల్గొన్న ఉపరాష్ట్రపతి

- డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ, అటల్ బిహారీ వాజ్ పేయి భవన్, చంద్రశేఖర్ ఆజాద్ హాస్టల్ ను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 4:మాతృభాషలోనే ప్రాథమిక విద్యావిధానం ద్వారా సమాజంలో సానుకూల మార్పులు సాధ్యమంటూ మహాత్మాగాంధీ సూచించిన 'నయా తాలీమ్'ను నూతన జాతీయ విద్యావిధానం ప్రతిబింబిస్తోందని గౌరవ భారత ఉపరాష్ట్రపతి శ్రీ ముప్పవరపు వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

మహారాష్ట్రలోని వర్ధాలో ఉన్న మహాత్మాగాంధీ అంతర్రాష్ట్రీయ హిందీ విశ్వవిద్యాలయం రజతోత్సవ వేడుకల్లో ఉపరాష్ట్రపతి అంతర్జాల మాధ్యమం ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వ విద్యాలయ ఆవరణలో నిర్మించిన రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఉపరాష్ట్రపతి ఆవిష్కరించారు. మాజీ ప్రధాని, భారతరత్న శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి పేరుతో నిర్మించిన భవనాన్ని, స్వాతంత్ర్య పోరాట యోధుడు శ్రీ ఆజాద్ చంద్రశేఖర్ పేరుతో నిర్మించిన విద్యార్థుల వసతిగృహ సముదాయాన్ని ఉపరాష్ట్రపతి ప్రారంభించారు.

అనంతరం ఉపరాష్ట్రపతి ప్రసంగిస్తూ.. 1937లో వర్ధాలో జరిగిన కార్యక్రమంలోనే మహాత్మాగాంధీ 'నయా తాలీమ్'ను ప్రతిపాదించారని గుర్తుచేశారు. ప్రతి ఒక్కరికీ విద్యను ఉచితంగా, తప్పనిసరిగా అందించడం, ప్రాథమిక విద్య కచ్చితంగా మాతృభాషలోనే ఉండాలని చెప్పడం, దీంతోపాటుగా నైపుణ్య శిక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని నాడు మహాత్ముడు బోధించడం నేటి పరిస్థితులకు సరిగ్గా సరిపోతుందన్నారు. భారతదేశ స్వరాజ్య సంగ్రామం గ్రామ గ్రామాలకు వెళ్లడంలో ఆయా ప్రాంతాల్లోని మాతృభాషల ప్రభావం ఎంతగానో ఉందని.. గాంధీ పేర్కొన్నారన్నారు.

భారత రాజ్యాంగసభ కూడా తీవ్రంగా చర్చించిన తర్వాత హిందీ భాషకు దేశభాష హోదాను కట్టబెట్టడంతోపాటు ఇతర భారతీయ భాషలకు కూడా రాజ్యాంగ హోదాను కట్టబెడుతూ ఎనిమిదవ షెడ్యూల్ లో పొందుపరిచిన విషయాలను ఉపరాష్ట్రపతి గుర్తుచేశారు. ప్రతి భారతీయ భాషకూ ఉన్నతమైన, వైభవోపేతమైన సాహిత్యం ఉందని, ఇలాంటి సాహిత్యాన్ని ఆయా భాషల్లో ఉన్నవారు అధ్యయనం చేయడంతోపాటు ఇతర భాషల్లోకి వీటిని అనువాదం చేయడం ద్వారా భారతీయులందరికీ మన సాహిత్య సమృద్ధిని అందజేసినట్లుం టుందన్నారు. భాషావైవిధ్యతే భారతదేశానికి బలమని, ఇదే మన సాంస్కృతిక వైవిధ్యతకు ప్రతిరూపమని ఉపరాష్ట్రపతి అన్నారు.

సమసమాజ స్థాపనలో భాష కీలకమైన పాత్ర పోషిస్తుందని ఇందుకోసం మృదుమధురమైన, విలువలు కలిగి, సృజనాత్మకమైన భాష అత్యంత అవసరమని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, హుందాతనంతో పదాలను వాడుతూ తమ భావప్రకటన స్వేచ్ఛను సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు.

డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కూడా విద్య ద్వారానే సమాజంలో సానుకూల మార్పులు తీసుకురాగలమని బలంగా విశ్వసించారని, ఇందుకు మాతృభాషకే వారుకూడా ప్రాధాన్యత ఇచ్చారని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. విశ్వ విద్యాలయ ఆవరణలో ప్రతిష్టించిన అంబేద్కర్ విగ్రహం, విద్యార్థులకు, అధ్యాపకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని ఆయన అభిలషించారు.

మాజీ ప్రధాని శ్రీ అటల్ బిహారీ వాజ్ పేయి గారు భారతీయ భాషలకు గౌరవం దక్కాలన్న ఆకాంక్షతో ఐక్యరాజ్యసమితి సమావేశంలో తొలిసారి హిందీ మాట్లాడారన్నారు. ఆ తర్వాత ఐరాస సమావేశాల్లో, ఇతర అంతర్జాతీయ వేడుకలపై ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హిందీలోనే మాట్లాడుతున్నారన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, అమరవీరుడు చంద్రశేఖర్ ఆజాద్ స్ఫూర్తితో యువత దేశాభివృద్ధిలో తమవంతు భూమిక పోషించాలని ఉపరాష్ట్రపతి అభిలషించారు.

హిందీ భాషలోని సాహిత్యాన్ని ఆన్ లైన్లో అందుబాటులోకి తేవడం ద్వారా స్వదేశంలో, విదేశాల్లో ఉన్నవారికి సాహిత్యంలోని ప్రతి కోణాన్ని తెలుసుకునేందుకు సహాయం చేస్తున్న ఈ విశ్వవిద్యాలయ బాధ్యులను ఉపరాష్ట్రపతి అభినందించారు. ఈ ప్రయత్నం ఇతర భారతీయ భాషల్లోనూ జరగాల్సిన అవసరం ఉందన్నారు.ఫ్రెంచ్, స్పానిష్, చైనీస్, జాపనీస్ తదితర అంతర్జాతీయ భాషలను హిందీ మాధ్యమం ద్వారా బోధిస్తున్న విశ్వవిద్యాలయ అధ్యాపకులను కూడా ఆయన అభినందించారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర సామాజిక న్యాయ శాఖ సహాయ మంత్రి శ్రీ రాందాస్ అఠావలే, వర్ధా ఎంపీ శ్రీ రాందాస్ తాడస్, విశ్వవిద్యాలయ ఉప కులపతి ప్రొఫెసర్ రజనీశ్ కుమార్ శుక్లాతోపాటు స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఇతర ప్రజాప్రతినిధులు, విశ్వవిద్యాలయ అధ్యాపకులు, విద్యార్థులు ప్రత్యక్షంగా, ఆన్ లైన్ వేదిక ద్వారా పాల్గొన్నారు.

శీతాకాలంలో వెచ్చదనం కోసం 'ఎలక్ట్రిక్ బ్లాంకెట్స్'

హైదరాబాద్, జనవరి 4:వేసవికాలంలో చల్లదనం కోసం ఏసీ, కూలర్లు వాడతాం. మరి చలికాలంలో వెచ్చదనం కోసం ఏం వాడతాం వారి వారి తాహత్తుకి తగ్గట్టుగా రూం హీటర్స్ లేదా దుప్పట్లు వాడతారు. అయితే అందరూ రూం హీటర్స్ ని వాడలేరు కదా. ఎక్కువ శాతం మంది దుప్పట్లవైపే మొగ్గు చూపుతుంటారు. అయితే మీకు ఎలక్ట్రిక్ బ్లాంకెట్ గురించి తెలుసా. ఈ రకం దుప్పట్లు షాక్, అధిక వేడి నుండి కాపాడుతుండట. ఇది చాలా ఆకర్షణీయమైన రంగుల్లో లభించే డబుల్ బెడ్ బ్లాంకెట్. అంతేకాదు ఎలక్ట్రిక్ దుప్పట్లు తేలికగా, మెత్తగా కూడా ఉంటాయి. ఇవి డబుల్ బెడ్ సైజులో లభిస్తాయి కూడా. ఇది 185లీ155ఇఎ పరిమాణంలో ఉండే ఎలక్ట్రిక్ దుప్పటి.

ఇది షాక్‌ప్రూఫ్ రక్షణతో వస్తుంది. దీనితో పాటు, వేడిని తగ్గించడానికి ఈ ఎలక్ట్రిక్ బ్లాంకెట్ లో మాన్యువల్ హీట్ కంట్రోలర్ ఆప్షన్ కూడా ఇచ్చారు. ఇది పాలిస్టర్ మెటీరియల్‌తో తయారు చేయబడింది. ఈ దుప్పటిని ఉపయోగించడం ప్రారంభించిన కొద్దిసేపటి తర్వాత వేడి అవుతుంది. ఇది పోలార్ ఫ్రాబ్రిక్‌తో తయారు చేయబడింది. 150 లీ 160 సెం.మీ సైజులో లభిస్తుంది. ఇది 100 శాతం సురక్షితం కూడా.ఈ ఎలక్ట్రిక్ బ్లాంకెట్ లో, 3 విభిన్న హీట్ సెట్టింగ్‌లు అందించబడుతున్నాయి. మీ ఇష్టం ప్రకారం మీరు వీటిని సులభంగా నియంత్రించవచ్చు. ఇది వాటర్ ప్రూఫ్ టెక్నాలజీతో ఉంటుంది. మీరు కూడా సులభంగా శుభ్రం చేయవచ్చు. ఇది ఎలక్ట్రిక్ వినియోగాన్ని కూడా తగ్గిస్తుంది.

అమెరికాలో కరోనా కల్లోలం - ఒక్కరోజే పది లక్షల కరోనా కేసులు

న్యూఢిల్లీ, జనవరి 4:అగ్రరాజ్యం అమెరికాలో కరోనా మహమ్మారి కల్లోలం సృష్టిస్తుంది. ఈ మేరకు ఒక్కరోజే పది లక్షల పాజిటివ్ కేసులు నమోదు కావడం ఆందోళన కలిగిస్తుంది. ఒకే రోజు ఇన్ని కేసులు ఏ దేశంలో నమోదు కాలేదు. కరోనా కట్టడి కోసం ప్రభుత్వం చర్యలు చేపటింది. కాగా అమెరికాలో గత నాలుగు రోజుల నుండి ఇప్పటి వరకు 5,90,000కేసులు నమోదు అయ్యాయి. కాగా సోమవారం నాటికి ఆ సంఖ్య కాస్తా రెట్టింపు అయింది. కరోనా కట్టడి కోసం బైడెన్ సర్కార్ కఠిన చర్యలు తీసుకుంటుంది. కోవిడ్-19 ఉధృతి నేపథ్యంలో అమెరికాలో స్కూళ్లు, కార్యాలయాలను మూసివేశారు. విమానాలను రద్దు చేశారు. ఇక కరోనా, ఒమిక్రాన్ కేసుల తీవ్రతతో హాస్పటల్స్ నిండిపోతున్నాయి. దాదాపు అక్కడి ఆస్పత్రుల్లో 70 శాతం వరకు నిండిపోయినట్టు సమాచారం. కరోనా బారినపడుతున్న వారిలో ఆరోగ్య సిబ్బంది సైతం అధికంగా ఉండటంపై ఆ దేశ ఆరోగ్య వ్యవస్థ తీవ్ర ఒత్తిడికి గురయ్యే అవకాశాలున్నాయని నిపుణులు తెలిపారు. కరోనావైరస్ వ్యాధి (కోవిడ్-19) కారణంగా ఆస్పత్రిలో చేరిన వారి సంఖ్య యునైటెడ్ స్టేట్స్‌లో దాదాపు నాలుగు నెలల్లో రికార్డు స్థాయికి చేరుకుంది.

ప్రస్తుతం 100,000 మందికి పైగా చేరారు. యు.ఎస్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెల్త్ అండ్ హ్యూమన్ సర్వీసెస్ (హెచ్ఎంఎస్) నుండి వచ్చిన తాజా డేటా ప్రకారం.. కోవిడ్-19 కారణంగా ఆస్పత్రిలో చేరిన వారి సంఖ్య చివరిగా 2021 సెప్టెంబర్ 11న 100,000ను దాటింది. ప్రతి ఏడుగురిలో ఒకరు కోవిడ్-19తో బాధపడుతున్నారని రిపోర్ట్స్ తెలిపాయి. అమెరికాలోని ఒహియో, డెలావేర్, న్యూజెర్సీ, వ్యోమింగ్, అలాస్కా వంటి ప్రాంతాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. కరోనా బారినపడి ఆస్పత్రుల్లో చేరుతున్న పిల్లల సంఖ్య పెరుగుతుండటం మరింత ఆందోళనకి గురి చేస్తుంది. డిసెంబర్ 31తో ముగిసిన వారంలో ప్రతిరోజూ 500 మందికి పైగా పిల్లలు కరోనాతో ఆస్పత్రుల్లో చేరుతున్నారని యుఎస్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (డిసిడి) డేటా వెల్లడించింది. ఒమిక్రాన్ వేరియంట్ వేగంగా వ్యాపిస్తున్న క్రమంలో అమెరికా ప్రెసిడెంట్ జో బిడెన్, వైస్ ప్రెసిడెంట్ కమలా హ్యారిస్ అప్రమత్త మయ్యారు. ఈ వేరియంట్‌ను అడ్డుకోగలిగే చర్యలపై కరోనా వైరస్ రెస్పాన్స్ బృందాలతో ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్ సమీక్ష చేయనున్నట్లు స్థానిక మీడియా తెలిపింది.

ఈశాన్య ప్రాంత అభివృద్ధి మంత్రిత్వ శాఖ కింద అరుణాచల్ ప్రదేశ్‌లోని చాంగ్‌లాంగ్, బోర్డుమ్సా మహిళా స్వయం సహాయక బృందాల విజయగాథ

న్యూఢిల్లీ, జనవరి 4:ఎన్ఇఆర్‌సిఒఆర్ఎంపి ప్రాజెక్టు కింద 2018లో అరుణాచల్ ప్రదేశ్‌లోని చాంగ్‌లాంగ్, బోర్డుమ్సాలో జాస్మిన్ స్వయం సహాయక బృందాల (ఎస్‌హెచ్‌జి) సమాఖ్యను ఏర్పాటు చేయడం జరిగింది. జాస్మిన్ స్వయం సహాయక సమాఖ్యలో మొత్తం 16 ఎస్‌హెచ్‌జిలు ఉన్నాయి. సమాఖ్య, 2019లో ప్రాజెక్టు నుంచి రూ. 193,939ని రివాల్వింగ్ ఫండ్‌గా అందుకుంది. ఈ మొత్తంతో, ఆదాయకల్పనా కార్యకలాపంగా (ఐజిఎ) తమ ప్రాంతంలోనర్సరీలు లేకపోవడంతో పూలమొక్కల పెంపకాన్ని (ఫ్లోరికల్చర్) ప్రారంభించారు.

పూలమొక్కల పెంపకంతో పాటుగా, పోకచెక్కల నర్సరీ కూడా ఐజిఎలో భాగంగా ఉంది. తమ చిన్న తరహా వ్యాపారాన్ని మెరుగుపరచుకునేందుకు, అభివృద్ధి చేసేందుకు

ప్రతి ఎస్‌హెచ్‌జి సభ్యురాలూ తమ వంతు సహకారాన్ని అందిస్తున్నారు. అతి తక్కువ సమయంలోనే, స్థానిక కార్యక్రమాలలో తమ నర్సరీని ప్రదర్శిస్తుండడంతో, ఆ ప్రాంతం వారికి బాగా నచ్చిన నర్సరీ అయింది. మొక్కల పెంపకానికి అవసరమైన వస్తువులను, మొక్కలను కొనుగోలు చేసేందుకు వినియోగదారులు వివిధ ప్రాంతాల నుంచి రావడం ప్రారంభించారు.

స్వయంసహాయక బృందాల సమాఖ్యకు మార్కెట్‌కు లంకెగా అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్రావతరణ దినోత్సవం, గ్రామీణ హాట్, ఎగ్జిబిషన్